



# విజయభాను







విశాఖపట్నం, శనివారం 31-03-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 197 పేజీలు : 8 వెల : 1 రూపాయి





### విదేశాల్లో నివసించే భారతీయులే

## శాశ్వత రాయబారులు

- భారత్- ఆఫ్రికా దేశాల మధ్య బలపడుతన్న సత్సంబంధాలు
- నైరోబీతో టెలికాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ

దిల్లీ: విదేశాల్లో నివసించే భారతీయులే దేశానికి శాశ్వత రాయబారులని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కెన్యా రాజధాని నైరోబీలో కచిలేవా పటేల్ సమాజ్ రజతోత్సవాలను ఉద్దేశించి ప్రధాని మోదీ దూరదృశ్య మాధ్యమం ద్వారా ప్రసంగించారు. తూర్పు ఆఫ్రికా అభివృద్ధిలో ఈ సామాజికవర్గం పాత్రపై ప్రశంసలు కురిపించారు.

గుజరాత్‌లోని కచ్‌లో భూకంపం వచ్చినప్పుడు సహాయ, పునర్‌నిర్మాణ పనుల్లో సైతం వీరు చాలా సాయం చేశారని ప్రధాని గుర్తు చేశారు. ఒకప్పుడు ఎడారిగా గుర్తింపు పొందిన కచ్ ప్రాంతం ఇప్పుడు పర్యాటక ప్రదేశంగా మారిందని మోదీ అన్నారు. గత కొన్నేళ్లలో కచ్ ప్రాంతంలో చాలా నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. భారత్- ఆఫ్రికా దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడుతున్నట్లు ప్రధాని అన్నారు.

### ఎస్‌బీఐ వినియోగదారులకు శుభవార్త




దిల్లీ: దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నుంచి గృహ రుణాలు తీసుకోవాలనుకుంటున్నారా? అయితే నేడే తీసుకోండి. మార్చి 31 వరకు గృహ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును ఎస్‌బీఐ రద్దు చేసింది. ఈ మేరకు తమ అధికారిక ట్విటర్ ఖాతాలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఎస్‌బీఐ గృహ రుణాలపై మార్చి 31 వరకు ప్రాసెసింగ్ ఫీజును పూర్తిగా రద్దు చేశాం. అంతేగాక.. ఆకర్షణీయమైన వడ్డీరేట్లు తరువాయి 2లో

### అవిశ్వాసంపై

## కేంద్రం భయపడుతోంది



దిల్లీ: సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాలు ముగిశాయి. పొలిట్ బ్యూరో రూపొందించిన పార్టీ సంస్థాగత ముసాయిదా నివేదికపై చర్చించారు. నివేదికను అఖిల భారత మహాసభల్లో ప్రవేశపెట్టనున్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో అఖిల భారత మహాసభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మీడియాతో మాట్లాడారు. రెండు వారాలుగా తెదేపా, వె%కాపాలు.. కేంద్రంపై అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇస్తున్నాయి. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వనందున ఎన్డీఏ నుంచి తెదేపా బయటకు తరువాయి 2లో

### పేపర్ల లీకేజీ

## తేలిగ్గా తీసుకోవద్దు



దిల్లీ: సీబీఎస్ఈ పేపర్ల లీకేజీ వ్యవహారంపై దేశంలో రాజకీయ దుమారం చెలరేగుతోంది. ఈ అంశంపై ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకు పడుతున్నాయి. తాజాగా దిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ ఈ వ్యవహారంపై స్పందించారు. పరీక్ష పేపర్ల లీకేజీ విషయంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి తప్ప దాన్నంత తేలిగ్గా తీసుకోరాదని సూచించారు. ఈ పేపర్లు ఎలా లీకయ్యాయనే అంశంపై సమగ్ర విచారణ జరిపి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని షీలా కోరారు. మార్చి 26న 12వ తరగతి ఎకనమిక్స్ తరువాయి 2లో

### ప్రశ్నపత్రాలే కాపాడలేకుంటే

## దేశాన్ని ఎలా రక్షిస్తారు?



దిల్లీ: ప్రశ్నపత్రాల లీక్‌పై కేంద్రాన్ని కాంగ్రెస్ తప్పుబట్టింది. ప్రశ్నపత్రాల్ని భద్రంగా ఉంచలేని వారు దేశాన్ని ఎలా రక్షిస్తారని ప్రశ్నించింది. కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ మాట్లాడుతూ పరీక్షల విధానాన్ని అనాలోచితంగా మార్చారని ధ్వజమెత్తారు. ఇలా జరగడం చరిత్రలో తొలిసారి. ఎన్నడూ లేని విధంగా దేశ వ్యాప్తంగా ఒకే ప్రశ్నపత్రం రూపొందించడమే ఇందుకు కారణం. నేను మంత్రిగా ఉన్నప్పుడు సీబీఎస్ఈ వివిధ జోన్లకు వేర్వేరు ప్రశ్నపత్రాలు రూపొందించేది. ప్రతి జోన్‌లోనూ... వేర్వేరు ప్రాంతాల్లో ప్రశ్నల సంఖ్య వేరుగా ఉండేది. తరువాయి 2లో

## అగ్ని మృత్యు శకటం..

### బస్సులో మంటలు .. డ్రైవర్ సహా 20 మంది సజీవదహనం

### డ్రగ్స్ తీసుకుని బస్సు నడిపిన డ్రైవర్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో శుక్రవారం ఉదయం ఘోర బస్సు ప్రమాదం జరిగింది. మయన్మార్‌కు చెందిన ప్రయాణికులతో వెళుతున్న బస్సులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి.


ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా 20 మంది ప్రయాణికులు సజీవదహనమ్యారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 47 మంది ప్రయాణికులు ఉన్నట్లు సహాయక సిబ్బంది వెల్లడించారు.

థాయ్‌లాండ్‌లో వలస కూలీలకు సరైన జీతాలు ఇవ్వరు. వాహనాల విషయంలో పెద్దగా భద్రతా ప్రమాణాలు పాటించరు. గతేడాది తరువాయి 2లో

### చంద్రబాబుకు

## టాలీవుడ్ మద్దతు

- ప్రత్యేక పోరాటానికి బాసటగా ఉంటాం
- నల్లబ్యాడ్జీలతోనే షూటింగ్‌లకు..



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పలువురు సినీ ప్రముఖులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విభజన హామీల అమలు కోసం సీఎం చేస్తున్న పోరాటానికి బాసటగా ఉంటామని వెల్లడించారు. ప్రత్యేకహోదా సాధన కోసం తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ మేరకు సినీ ప్రముఖులు కె. రాఘవేంద్ర రావు, అశ్వనీదత్, కేఎల్ నారాయణ, కేఎస్ రామారావు, జెమిని కిరణ్, కె. వెంకటేశ్వరరావు తదితరులు సీఎంను కలిశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నల్లబ్యాడ్జీలతో నిరసనలో పాల్గొన్నారు. ఏప్రిల్ 6 వరకు నల్లబ్యాడ్జీలు ధరించనున్నట్లు పేర్కొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుత నిర్మాణం

- జార్ఖండ్ మాజీ సీఎం సోరెన్
- మంత్రి హరీశ్‌రావుతో కలిసి సందర్శన



భూపాలపల్లి: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో కలిసి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్లో నేరుగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారేజీకి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు వారికి బ్యారేజీ వద్ద సాదర స్వాగతం పలికారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను సోరెన్‌కు హరీశ్‌రావు వివరించారు. మ్యాపుల ద్వారా ప్రాజెక్టు పురోగతిని సవివరంగా తెలియచేశారు. మేడిగడ్డ బ్యారేజీ గేట్ల బిగింపు ప్రక్రియ కూడా ఇటీవలే ప్రారంభమైందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం తరువాత కొత్తగా సాగయ్యే ఆయుకట్టు వివరాలను సోరెన్ మంత్రిని అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు తక్కువ సమయంలోనే శరవేగంగా జరుగుతున్నాయని.... అతిపెద్ద తరువాయి 2లో

## ఏప్రిల్ 2న రాష్ట్ర వ్యాప్త నిరాహార దీక్ష...

న్యూఢిల్లీ: కావేరీ జలాల సమస్యపై ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్త నిరాహార దీక్ష చేయనున్నట్టు తమిళనాడు అధికార పార్టీ అన్నాడీఎంకే ప్రకటించింది. పార్లమెంటు వేదికగా తమ ఎంపీలు తీవ్ర స్థాయిలో పోరాటం చేసినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ప్రవర్తిస్తోందని ఆ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆరు వారాల్లోగా కావేరీ నిర్వహణ మండలి (సీఎంబీ), కావేరీ జలాల నియంత్రణ సంస్థ (సీడబ్ల్యూఆర్‌ఏ)లను ఏర్పాటు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు విధించిన గడువు గురువారంతో ముగిసింది. అయినప్పటికీ సుప్రీం ఆదేశాలు ఆచరణలోకి రాకపోవడంపై తమిళనాడు ప్రతిపక్ష డీఎంకే పార్టీ అక్కడి ప్రభుత్వంపై మండి తరువాయి 2లో

## తొల్లిచూపిన శ్రద్ధ ఇపుడేదీ?

### జేఎఫ్సీ కమిటీ రిపోర్టు గురించి ఏమిచేశారు? -- పవన్‌పై జేపీ తీవ్ర అసంతృప్తి



హైదరాబాద్: జనసేనాని పవన్‌కల్యాణ్‌పై లోక్‌సత్తా నేత జయప్రకాశ్ నారాయణ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జేఎఫ్సీపై పవన్ తొలుత చూపిన శ్రద్ధ తర్వాత చూపడం లేదని ఆయన ఆరోపించారు. విభజన హామీల కోసం స్వతంత్ర నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ఈ బృందంలో మాజీ ఐఏఎస్ పద్మనాభయ్య, ప్రొ.గలాబ్, రాఘవాచారీ, శాంతాసిన్హా, హెచ్‌ఏ దొర, ఇతర ప్రముఖులుంటారని చెప్పారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా లేఖపై కూడా నిపుణుల బృందం అధ్యయనం చేస్తుందని, ఏపీకి రూ.74వేల కోట్లకు పైగా నిధులు రావాలని జేఎఫ్సీ తేల్చిందన్నారు. కేంద్ర పెద్దలు సమయమిస్తే ఢిల్లీ వెళ్లి లెక్కలు అందజేస్తామని, విభజన హామీల అమలుకు పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయటం లేదని జేపీ దుయ్యబట్టారు. దేశంలో ఫెడరల్ వ్యవస్థ బలోపేతానికి స్వతంత్రంగా కృషి చేస్తామని, రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి అవసరమని జేపీ అభిప్రాయపడ్డారు.

విభజన హామీల్లో భాగంగా ఏపీకి కేంద్రం ఎంత కేటాయించింది?... ఏపీ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో? తేల్చేందుకు పవన్ కల్యాణ్ జేఎఫ్సీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జయప్రకాశ్ నారాయణ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, పద్మ నాభయ్య, వామపక్ష నేతలు, ఇతర పార్టీల నాయకులను పిలిచి మరీ మీటింగ్ పెట్టి జేఎఫ్సీ ప్రకటించారు. ఆ తర్వాత ఈ కమిటీకి ఏపీ ప్రభుత్వం సమాచారం అందించింది. అలాగే కమిటీ సభ్యులు కూడా సమాచారం సేకరించారు. అయితే ఇప్పటి వరకు ఈ కమిటీ రిపోర్టు గురించి కానీ భవిష్యత్ కార్యాచరణ గురించి కానీ పవన్ ప్రకటించక పోవడం గమనార్హం.











ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణి సంస్థ మహిళ డైరెక్టర్ గా నియమితులైన శోభ హైమవతి శుక్రవారం ఉదయం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ హెచ్.వై.దొరను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ టి.వి.ఎస్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాయామంతో ఆరోగ్యం మెరుగుపరచుకోవచ్చు

## ప్రముఖ సినీ హీరో సుమన్



అక్కయపాలెం: వ్యాయామంతో శరీర దృఢత్వంతో పాటుగా మన ఆరోగ్యం మెరుగు పరచుకోవచ్చని ప్రముఖ సినీ హీరో సుమన్ పెర్కొన్నారు . ఈమేరకు జివిఎంసి 34 వ వార్డు అక్కయపాలెం పరిది నర్సింహానగర్ జాతీయ రహదారి ప్రక్కన ఎసెంట్ ఫిట్నెస్ వ్యాయమ పరికరాల నూతన షోరూమ్ ను ఆయన శుక్రవారం ప్రారంబించారు . ఈసందర్భంగా హీరో సుమన్ మాట్లడుతూ నిత్యం విధుల్లో బిజిగా గడుపుతున్న మనం కొంత సమయం వ్యచించి వ్యాయామం చెయడం వలన మానసిక ప్రశాంతత పొందొచ్చని అన్నారు. ఎసెంట్ ఫిట్నెస్ ఎక్యుప్మెంట్ షోరూమ్ డైరెక్టర్ బాల సత్య నారాయణరావు మాట్లడుతూ విశాఖలో మొదటి సారిగా యూకో దేశం నుండి అత్యా ధునికమైన "హైడ్రోలిక్ " వ్యాయమ పరికరాలు తమ షోరూమ్ లో అందుబాటులో ఉంచా మన్నారు. ఇప్పటికే మురళీ నగర్ ప్రాంతంలో వ్యాయామ కేంద్రం ఎర్పాటు చేయడం జరి గిందని త్వరలో సిరిపురం, పెద్ద వాల్తేరు తదితర ప్రాంతల్లో నూతన షోరూమ్ లు ఎర్పాటు చేసేవిదంగా కృషి చేస్తున్నామన్నారు. అంతకుముందు కార్యక్రమంలో పాల్గున్న సినీ హీరో సుమన్ జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎసెంట్ ఫిట్నెస్ ఎక్యుప్మెంట్ షోరూమ్ ఏరియా మేనేజర్ బి.లక్ష్మణ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ జే .ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా శ్రీసంపత్ వినాయక విగ్రహ ప్రతిష్ట



విజయనగరం : పట్టణం లోని స్టేడియం కాలనీలో శ్రీ సంపత్ వినాయక విగ్రహ ఆలయ ప్రతిష్టా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే ఆధ్యాత్మికత వెల్లివిరిస్తుందో తప్పక ఆ సమాజం అన్ని విధాలా ముందుంటుందని అన్నారు. నిర్వాహకులు నాగబాబు, చంటి, కాలనీ వాసులు సహకారంతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికత వెల్లివిరియాలనే ధ్యేయంతో గత కొన్ని సంవత్సరాలుగా వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహించి ఆలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వరసిద్ది వినాయక ఉత్సవ కమిటీ ద్వారా మరిన్ని సమాజ హిత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా సమాజ హితానికిపాటుపడుతున్న నాగబాబు, చంటిలు అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా కోలగట్లదంపతులను వేద పండి తులు మంత్రోచ్చరణల మధ్య పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. సంపత్ వినాయకునికి కోల గట్ల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కోలగట్ల సతీమణి, 20వ వార్డు కౌన్సిలర్ కోలగట్ల వెంకటరమణి, ఉత్సవ కమిటీ సభ్యులు జగన్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న రిలే దీక్షలు

యలమంచిలి రూరల్ : ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక హోదా కోరుతూ యలమంచిలి పట్టణంలో చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు శుక్రవారంతో ఐదో రోజుకు చేరాయి. టీడీపీ పట్టణ అధ్యక్షులు ఆడారి ఆనంద్కుమాత్ మాట్లాడుతూ రాష్ట్రానికి తక్షణమే ప్రత్యేక హోదా ప్రకటించాలన్నారు. ప్రత్యేక హోదా సాధనే ధ్యేయంగా ప్రజలంతా ముందడుగు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు గొంతిన నాగేశ్వరరావు, కొలుకులూరి నేతలు గొంతిన నాగేశ్వరరావు, విజయ్బాబు, కొండ బాబు, హరిబాబు, ఆడారి శ్రీధర్ ఉన్నారు.

# కన్నులపండువగా శ్రీక్షేత్రమ్‌లో మహాలక్ష్మీ జయంతి ఉత్సవ వేడుకలు



విజయనగరం : ప్రముఖ భారతీయ తత్త్వదర్శనకేంద్రం శ్రీక్షేత్రమ్‌లో గల అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఉదయం చైత్రశుద్ధపౌర్ణమి (పాల కడలిలో అమ్మవారు ఆవిర్భవించిన దినోత్సవం) సందర్భంగా మహాలక్ష్మీ జయంతి ఉత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. దేవాలయం ప్రధాన అర్చకులు అంపోలు లక్ష్మీనరసింహాచార్యులు, చామర్తి రమేష్‌ల ఆధ్వర్యంలో ఐశ్వర్యలక్ష్మీదేవికి అష్టోత్తర కలశ స్నపనం, (108 కలశాలతో) అభిషేకం నిర్వహించారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

## తహసీల్ధార్ కనకారావు



మాట్లాడుతున్న తహశీల్దార్ కనకారావు

నాతవరం : ప్రతీ ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని తహశీల్దార్ కనకారావు అన్నారు. గురువారం రాత్రి జిల్లేడిపూడి గ్రామంలో పల్లెనిద్రకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. గ్రామాల్లో భూస్వచ్ఛీకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామంలో పారిశుద్యంలేకుండా చూసుకోవాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోవ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

## ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే బండారు



పరవాడ: లంకెలపాలెం నుంచి ఫార్మసిటీ సెంట్రల్ లైటింగ్ ను శుక్రవారము ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా స్థానిక శాసనసభ్యులు బండారుసత్యనారాయణమూర్తి హాజరై అతని చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరవాడ జిల్లా ప్రాదేశిక సభ్యులు పైలజగన్నాదరావు, టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రౌతుశ్రీను వాసురావు, ఇ.బోనంగి ఉపసర్పంచ్ బుగిడిగోవింద, అనకాపల్లి మార్కెటింగ్ కమిటీ డైరక్టర్ కోమటి వెంకటరమణ, మాజీ ఎంపివి మాదంశెట్టి నీలబాబు, టిడిపి ప్రెసిడెంట్ బొండా సన్నిదేముడు, బొడ్డిపల్లి అప్పారావు, సంబందిత అధికార్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 3 న జివిఎంసి షాపులు, కల్యాణ మండపాల వేలం

కంచరపాలెం : జివియంసి జోన్ -4 పరిధిలో ఉన్న జివిఎంసి షాప్ లు , మర్కెట్ మరియు కల్యాణ మండపాల నిర్వహణకు సంబంధించి ఏప్రిల్ 3 న వేలం నిర్వహిస్తునట్లు జివిఎంసి జోన్ -4 ఎస్ఐ రమణమూర్తి తెలిపారు.

అసక్తి గల వారు జ్ఞాన పురం కూడలి వద్ద నున్న జివిఎంసి జోన్ -4 కార్యాలయానికి 3 వ తేది ఉదయం 11 గంటల సమయంలో 200 చెల్లించి గజిట్ నోటిఫికేషన్ పొంది వేలం లో పాల్గొనాలని తెలియజేశారు.

మొదటి పేజీ తరువాయి

# ఎస్‌బీఐ వినియోగదారులకు శుభవార్త

కూడా ఉన్నాయి. సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని కోల్పోవద్దు అని ట్విటర్‌లో పేర్కొంది.

ఎస్‌బీఐలో రూ. 30 లక్షల వరకు గృహ రుణాలు తీసుకునే వేతన జీవులకు రూ. 8.4శాతం వడ్డీరేటు పడుతుంది. ఇదే ఉద్యోగం చేసే మహిళలకైతే 8.35 శాతం మాత్రమే. ఇక వేతన జీవులు కాకపోతే మహిళలకు 8.45 శాతం, పురుషులకు 8.5 శాతం వడ్డీరేటు ఉంటుంది. కాగా.. మార్చి 31 ఈ ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో గృహ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును రద్దు చేసింది ఎస్‌బీఐ.

# అగ్ని మృత్యు శకటం..

డబ్ల్యూహెచ్ఓ (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) నిర్వహించిన సర్వేలో థాయ్‌లాండ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 24,000 మంది మృత్యువాతపడ్డారు. గత వారం బ్యాంకాక్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో 18 మంది చనిపోయారు. తాజాగా జరిగిన ప్రమాదంలో బస్సు డ్రైవర్ మాదకద్రవ్యాలు తీసుకుని వాహనం నడిపినట్లు అధికారులు వెల్లడించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుత నిర్మాణం

ప్రాజెక్టు నిర్మాణాన్ని తెలంగాణ సర్కారు చేపడుతోందని సోరెన్ ప్రశంసించారు. సాంకేతికంగానూ అద్భుతంగా నిర్మిస్తున్నారని కొనియాడారు. సాగునీటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి నిర్మాణ సాగడం దురదృష్టకరమని... కాళేశ్వరంలో ఇందుకు భిన్నంగా వేగంగా పనులు జరుగుతున్నాయని ప్రశంసించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తికావాలని, రైతులకు మేలు చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. మేడిగడ్డ బ్యారేజీ పర్యటన ముగించుకుని అనంతరం అన్నారం బ్యారేజీకి వెళ్లి అక్కడ పనులను స్వయంగా పరిశీలించారు.

# ఏప్రిల్ 2న రాష్ట్ర వ్యాప్త నిరాహార దీక్ష...

పడింది. కేంద్రంతో అంటకాగుతూ, రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించారంటూ డీఎంకే నాయకుడు ఎంకే స్టాలిన్ అధికార పార్టీని నిలదీశారు. కాగా ఇవాళ దివంగత సీఎం జయలలిత జయంతి సందర్భంగా మధురైలో 120 జంటలకు ఒకే వేదిక వద్ద జరిగిన సామూహిక వివాహ వివాహ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ.. కావేరీ జలాలపై బోర్డును ఏర్పాటు చేయడంతో కేంద్రం తత్సారం చేయడంపై ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్త నిరాహార దీక్ష చేయనున్నట్టు ప్రకటించారు. అన్నాడీఎంకే ఆధ్వర్యంలో కావేరీ జలాలపై తమ మనోభావాన్ని తెలియచెప్పేందుకు అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో నిరాహార దీక్ష చేపడతామన్నారు. మరోవైపు కేంద్రంపై సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కారం కేసు కూడా పెట్టేందుకు తమిళనాడు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం.

# అవిశ్వాసంపై కేంద్రం భయపడుతోంది

వచ్చింది. అవిశ్వాస తీర్మానాలను చర్చకు తీసుకురావడంలో కేంద్రం విఫలమైంది. తప్పించుకునే ధోరణలో కేంద్రం వ్యవహరిస్తోంది. అవిశ్వాసంపై కేంద్రం భయపడుతోంది. మిగతా పార్టీలతో పాటు మేము కూడా అవిశ్వాస తీర్మానం నోటీసు ఇస్తున్నాం. చర్చ జరిగితే ఏపీకి ప్రత్యేక హోదా, హామీ సహా భాజపా వె%ఫల్యాలపై చర్చిస్తాం. ఫెడరల్ ఫ్రంట్‌పై సమావేశాల్లో చర్చించలేదు... ఎన్నికల సమయంలో చర్చిస్తాం అని ఏచూరి వెల్లడించారు.

# పేపర్ల లీకేజీ తేలిగ్గా తీసుకోవద్దు

పేపర్, మార్చి 28న పదో తరగతి గణితం పరీక్ష పేపర్లు పరీక్షప్రారంభానికి ముందే సామాజిక మాధ్యమాల్లో లీకైన విషయం తెలిసిందే. దీనిపై నిన్న సీబీఎస్ఈ చీఫ్ అనితా కార్వాల్ స్పందిస్తూ.. విద్యార్థులకు అనుకూలంగా తాము నిర్ణయాలు తీసుకున్నామని, వారి మంచి కోసమే తాము పనిచేస్తున్నామని అన్నారు. అందువల్ల మళ్లీ ఈ రెండు పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామని, త్వరలోనే పరీక్ష తేదీలను ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు.

జావడేకర్ నివాసం వద్ద భారీ భద్రత

మరోవైపు, పరీక్ష పేపర్ల లీకైన వ్యవహారంతో పాటు ఆ పేపర్లకు మళ్లీ పరీక్షనిర్వహిస్తామంటున్న సీబీఎస్ఈ ఛైర్‌పర్సన్‌ను తొలగించాలని విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి ప్రకాశ్‌జావడేకర్ నివాసం వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో దిల్లీలోని కుషాక్ రోడ్డులో పోలీసులు 144 సెక్షన్ విధించారు. మంత్రి నివాసం వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

# ప్రశ్నపత్రాలే కాపాడలేకుంటే దేశాన్ని ఎలా రక్షిస్తారు?

ఎక్కడైనా ప్రశ్నపత్రం లీకైనా విద్యార్థులందరిపై ప్రభావం పడకుండా అలాంటి జాగ్రత్తలు తీసుకునేవారు. ఆ విధానాన్ని ఎందుకు మార్చారో కేంద్రం చెప్పాలి?. ప్రశ్నపత్రం కోసం రూ.25వేలు ఇవ్వాల్సి వచ్చిందని బిహార్‌లో ఒక విద్యార్థి చెప్పాడు. అంటే... ఈ వ్యవహారాన్ని ఏదో మాఫియా నడిపిస్తోంది. ఆ మాఫియా వెనుక ఎవరున్నారు? పరీక్ష ప్రశ్నపత్రాన్ని భద్రంగా ఉంచలేని ప్రభుత్వం.. దేశాన్ని ఎలా రక్షిస్తుంది అని కపిల్ సిబల్ విమర్శించారు.

# వైభవంగా అరుణాచలేశ్వరస్వామి ప్రదోషోత్సవం

తిరువణ్ణామలై : తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో ప్రదోషోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజామునే ఆలయాన్ని తెరిచి మూలవర్లైన అరుణాచలేశ్వరస్వామికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. తర్వాత స్వామి, అమ్మవారిని అలంకరించి దీపారాధనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని మహా నంది సహా 7 నంది విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధన తదితర కార్యక్రమాలు జరిగాయి. చివరగా ఉత్సవ మూర్తులైన ఉన్నామలై సమేత చంద్రశేఖర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పళ్ళిపట్టు: పళ్ళిపట్టు పార్వతి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రదోషోత్సవం జరిగింది. ఉదయం మూలవర్లైన సంగమేశ్వర స్వామికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు.

సాయంత్రం ఆలయంలోని నంది విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. తర్వాత ఉత్సవ మూర్తులైన పార్వతి సమేత సంగమేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

# టోల్ పన్నుకు వ్యతిరేకంగా ఆందోళన

బరగఢ్ : సంబల్‌పూర్‌లో టోల్ పన్ను వసూళ్లు నిలిపివేయాలని డిమాండు చేస్తూ లారీ, బస్సు వాహనదారులు సంబల్‌పూర్ నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిం చారు. సంబల్ పూర్ జిల్లా హైవే యూజర్స్ సంఘం ఆధ్వ ర్యంలో చేపట్టిన ర్యాలీకి జిల్లాకి చెందిన లారీ, బస్సులతో పాటు అన్ని వాహన యాజమానుల సంఘాలు, జిల్లా న్యాయ వాద సంఘాలు పాల్గొన్నాయి. సంబల్ పూర్ జిల్లాకి చెందిన రిజిస్ట్రేషన్ వాహ నాలకు పన్ను మినహాయిం చాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఏప్రిల్2న సంబల్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తామన్నారు. ఉదయం 6నుంచి సాయంత్రం 5వరకు బంద్ సాగుతుందన్నారు. బైక్ ర్యాలీ సంబల్‌పూర్ శ్యామలేశ్వరీ ఆలయం నుంచి ప్రారంభమై మానేశ్వర్, సంబల్‌పూర్ పట్టణం మీదుగా పదాన్ పల్లి టోల్‌గేటు వరకు నిర్వహిం చారు.

హైవే యూజర్స్ సంఘం అధ్యక్షుడు భాగవత్ నందొ, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సురేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# కొఠియా గ్రామాల్లో అధికారుల పర్యటన

సిమిలిగుడ : ఒడిశా-ఆంధ్రా సరిహద్దులోని వివాదాస్పద కొఠియా గ్రామాల్లో పొట్టంగి సమితి, రెవెన్యూ అధికారులు బుధవారం పర్యటించారు. పొట్టంగి తహసీల్దార్ అరుణ్‌కుమార్ నేతృత్వంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గౌరీశంకర్ పట్నాయక్, అదనపు విద్యాధికారి రజనీకాంత్ బొడోనాయక్, సీఆర్‌సీసీ శితాకాంత్‌నాయక్, ఇతర అధికారులు ఈ ప్రాంతంలోని తాడివలస గ్రామంలో ఉదయం పర్యటించి గిరిజనులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాడివలసలో ఒడిశా ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఆశ్రమ పాఠశాల కోసం పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించి ఎంపిక చేశారు. అనంతరం దూళిపాద్రో గ్రామంలో పర్యటించిన అధికారులు మధ్యలో నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రం భవన పనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేసేలా స్థానికులతో చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలను తెలుసుకున్నారు. నేరడివలసలో నీటి పథకాలను పరిశీలించి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించారు. ఎగువ శెంబి, దిగువ శెంబి తదితర గ్రామాల్లో పాఠశాలలు పరిశీలించారు. విద్యావ్యవస్థ మెరుగుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వారు రాత్రి ఆంధ్రాలోని సాలూరు మీదుగా తిరిగి పొట్టంగికి చేరుకున్నారు.

ఉభయ రాష్ట్రాల మధ్య వివాదం తీవ్ర స్థాయిలో ఉన్న నేపథ్యంలో రెండు రాష్ట్రాల అధికారులు ఒకరితరావ్త ఒకరు పర్యటించి గ్రామాల అభివృద్ధికి క ృషి చేయడం విశేషం.

# ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాలలో ఘనంగా స్నాతకోత్సవం



భీమునిపట్నం : సంగివలస ఎన్.ఆర్.ఐ. లో ఎం.బీ.బీ.ఎస్. లో మొదటి బ్యాచ్ పూర్తయిన సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గణంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పద్మశ్రీ డాక్టర్ గుళ్ళపల్లి.నాగేశ్వరరావు,గౌరవ అతిధిగా డాక్టర్ రవికుమార్ లు హాజరయ్యారు. ముందుగా ముఖ్య అతిధి, గౌరవ అతిదులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కల్పనా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2012 లో 150 మంది విద్యార్థులతో మొదలైన ఈ కళాశాల నేడు అదే బ్యాచ్ వైద్య విద్యా కోర్సు ను పూర్తి చేసి 135 మంది డాక్టర్స్ విజయవంతం గా బయటకు వెళుతున్నారని ఆమె అన్నారు.కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ రామా రావు, డాక్టర్ క్రిష్ణమూర్తి,కె.ఎస్.ఎన్.రావు లు మాట్లాడుతూ పట్టాలను పొందిన విద్యార్దులను అభినందించారు.నాలుగున్నర సంవత్సరాల ఎం.బి,బి ఎస్.కోర్స్ పూర్తి చేసేందుకు ఎంతో శ్రమించారని దానికి తగ్గ ప్రతి ఫలంను పొందారని అన్నారు.అనీల్ నీరు కొండ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు నీరుకొండ బి.ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ విత్తనం నాటిన ఈ సంస్థ అందరి సహకారంతో ఇప్పుడు మహా వ ృక్షం మయిందని,ఎంతో మంది పేదలకు ఉచిత వైద్యంతో పాటుగా,ఉచిత ఆపరేషన్లు, ఉచిత మందులు అందిస్తున్నామని,అన్నారు.ఈ రోజువిద్యార్దులు డాక్టర్లు గా పట్టా పొందడం ఎంతో సంతోషంగా వున్నాదని అన్నారు.ఈ కళాశాల లో అను భవజ్ఞులైన ఆచార్యులు మెరుగైన సదుపాయలు ఉన్నాయని అన్నారు.గౌరవ అతిధి డాక్టర్ రవి కుమార్ ,వేమూరు మాట్లాడుతూ విద్యార్దులకు భవిష్యత్తు కార్యాచరణ గురించి పలు సూచనలు అందించారు.నాటి తరం కన్నా నేటి తరానికి వైద్య వ ృత్తి లో ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వైద్య వృత్తి ని సేవాభావంతో నిర్వతించాలని కోరారు.ముఖ్య అతిధి పద్మశ్రీ డాక్టర్ గుళ్ళపల్లి.నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరకి సేవా చేసే అవకాశం ఒక్క వైద్య వ ృత్తి లో మాత్రమే వుందని ఆబిప్రాయం వ్యక్తం చేసారు.అతిదుల చేతుల మీదుగా వైద్య వ ృత్తి లో ఉతీర్ణులైన వారికి పట్టాలు అందించారు.

ఈ సందర్భంగా పూర్వ ప్రిన్స్ పల్స్ కు సన్మానం చేశారు. డాక్టర్ శేఖర్ వందన సమర్పణ చేశారు. ఈ సమావేశంలో వైద్యులు క ృష్ణ ప్రసాద్, తెన్నేటి. జయరాజు,హేమంత్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## యాంత్రీకరణ నేపథ్యంలో

# ఇనుస్ట్రుమెంటేషన్‌కు ప్రాధాన్యం

### వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు




ఆంధ్ర విశ్వవిద్యాలయం : యాంత్రీకరణ నేపథ్యంలో ఇనుస్ట్రుమెంటేషన్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం ఉదయం ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఇనుస్ట్రుమెంటే షన్ ఇంజనీరింగ్ విభాగం దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరం నుంచి ఇనుస్ట్రుమెంటేషన్‌లో ఎంటెక్ కోర్సును ప్రారంభించడం జరుగుతోంద న్నారు. విశాఖలో ఉన్న విమ్స్ తో అవగాహన ఒప్పందం చేసుకుంటామన్నారు. ఈ రంగానికి అవసరమైన ఇనుస్ట్రుమెంటేషన్ నిపుణులను తయారు చేసి అందించడం అవసరమన్నారు.

విమ్స్ సంచాలకులు డాక్టర్ వర ప్రసాద్ మాట్లాడుతూ సమిష్టిగా పనిచేస్తే మంచి ఫలితాలను సాధించగలమన్నారు. వైద్య రంగంలో నిపుణులను తయారు చేయడానికి అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు.

విభాగాధిపతి ఆచార్య డి.వి రామకోటి రెడ్డి మాట్లాడుతూ నేడు భారీ పరిశ్రమల నుంచి వైద్య ఉపకరణాల వరకు తయారీ రంగాలలో ఇనుస్ట్రుమెంటేషన్ నిపుణుల అవసరం పెరుగుతోందన్నారు.

కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య జి.శశిభూషణ రావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని తదితరులు ప్రసంగించారు.

కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్చి 31 లోగా పన్నులు చెల్లించండి - అపరాధ రుసుం నుండి వెసులుబాటు పొందండి

### - డిసిఆర్ సోమన్నారాయణ

విశాఖపట్నం : మార్చి 31 వ తేదిలోగా ఇంటిపన్ను, నీటిచార్జీలు వెంటనే చెల్లించి చట్టపరమైన చర్యలు, మరియు అపరాధ రుసుముల నుంచి వెసులబాటు పొంది నగరాభివృద్ధికి తోడ్పడవలసినదిగా డిసిఆర్ సోమన్నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం అన్ని జోనల్ కార్యాలయాల యందుగల సౌకర్యం కేంద్రాలు మీ సేవా కేంద్రాలు శనివారం తేది.31.03.2018 ఉదయం 8.00 గంటల నుండి అర్ధరాత్రి 12.00 గంటల వరకుతెరువబడి పన్ను వసూళ్ళు చేపట్టబడును. కావున ప్రజలు సదరు విషయాన్ని గమనించి మహా విశాఖ నగర పాలక సంస్థ పురోగతికి తోడ్పడవలసినదిగా కోరడమైనది.



రైల్వేజోన్, ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్రకు ఆర్థిక ప్యాకేజీ, విభజన హామీలు అమలు కోసం విశాఖపట్నం కెజిహెచ్ హాస్పిటల్ లో రక్త దానం చేస్తున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ , సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె. వి. సత్యనారాయణ మూర్తి

# రూ.25 లక్షలతో కళ్యాణమండపానికి శంఖుస్థాపన ...

### - అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాసరావు

చోడవరం : అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేందుకై రూ.25 లక్షలతో నిర్మించబోయే కళ్యాణమండపానికి అనకాపల్లి ఎం.పి. అవంతి శ్రీనివాసరావు శుక్రవారం ఏర్పాటు చేసారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అనుమతులతో హార్డింజి రెష్టు హౌసు ఆవరణలో ఏర్పాటు చేయనున్న కళ్యాణమండపానికి అవంతి శ్రీనివాసరావు కళ్యాణమండపం నామకరణం చేసినట్లు చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు తెలియజేసారు. అనంతరం ఎం.పి. మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన చోడవరంలో సకల సౌకర్యాలతో ఏర్పాటు చేయబోయే కళ్యాణమండపం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే ప్రతీ గ్రామ పంచాయితీలో విరివిగా కళ్యాణ మండపాలు నిర్మిస్తామని తెలియజేసారు. అత్యంత ప్రజాదరణ పొందిన రాజకీయపార్టీగాను, అలాగే అత్యంత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన రాజకీయపార్టీగా తెలుగుదేశం నిలుస్తుందని అన్నారు. అలాగే హెచ్.పి.సి.ఎల్. ఎన్టీపీసి తదితర సంస్థల సహకారంతో పలుచోట్ల అభివృద్ధి చేస్తున్నట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గోవాడ షుగర్సు ఛైర్మను గూనూరు మల్లునాయుడు, మాజీ ఎం.పి.పి జి.వి.సత్యనారాయణ, సర్పంచు దొమ్మేశి అప్పలనర్సగిరి, విశాఖ డెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# డిసిఎంఎస్ పూర్వ వైభవానికి కృషి

### మహాజన సభలో పర్సన్ ఇన్‌చార్జ్ ముక్కా మహాలక్ష్మినాయుడు




అనకాపల్లి : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ (డిసిఎంఎస్) పూర్వవైభవానికి తనవంతు కృషి చేస్తానని పర్సన్ ఇన్‌చార్జ్ ముక్కా మహాలక్ష్మినాయుడు అన్నారు. శుక్రవారం డిసిఎంఎస్ ప్రధాన కార్యాలయంలో సొసైటీ 40 వ వార్షికోత్సవం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మినాయుడు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు సభ్యులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. అనంతరం పరిపాలన నివేదికను మహాసభ ముందు చదివి వినిపించారు. 127 సొసైటీల కలయికతో వ్యాపారాభివృద్ధి నిర్వహిస్తున్న డిసిఎంఎస్ పూర్వ వైభవానికి అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. 2017-18 పరిపాలన నివేదికను ఆమోదించారు. 2016-17 సంవత్సరం ఆడిట్ నివేదిక, 2018-19 అంచనా బడ్జెట్ అంశాలపై చర్చించారు. డిసిఎంఎస్ వ్యవస్థాపకులు బొడ్డేడ అచ్చియనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ అప్పారావు, డిసిఎంఎస్ డైరెక్టర్స్ అయినంపూడి బంగారురాజు, బోడా నారాయణరావు, బండారు వెంకన్నపాత్రుడు, ఆర్ఎస్ఎఎస్ఎల్. సన్యాశిరాజు, బండి సన్యాశయ్య దొర, మాసా నాగేశ్వరరావు, వివిధ సొసైటీల నుంచి వచ్చిన అధ్యక్షులు, సంస్థ సిబ్బంది, క్యాషియర్ గణపతి, తదితరులు పాల్గొన్నారు.

# రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

అనకాపల్లి : చోడవరనికి చెందిన ఇలిశెట్టి రాజశేఖర్ (30) వివాహేతర సంబంధం కారణంగా శుక్రవారం ఉదయం అనకాపల్లి అండర్ బ్రిడ్జ్ రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి 5 సంవత్సరాల క్రితం రాణి తో వివాహం జరిగింది. పిల్లలు లేరు. 6 నెలల క్రితం చోడవరం అంబేరుపురనికి చెందిన వివాహిత అశ్విని తో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. భర్త వదిలివేసిన అశ్వినికి ఒక పాప ఉంది.

రాజశేఖర్ సాక్షి పేపర్ లో ఎస్ అర్ గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం5గం తన ఫ్రెండ్స్ గ్రూపులో తన మరణం గురించి మిత్రులకు వీడియో వాట్స్ అప్ ద్వారా తెలియపర్చాడు. కేసును జి ఆర్.పి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు అనకాపల్లిలో ఉన్నత విద్య ... ఉపాధి, సుస్థిత భవితపై సదస్సు


అనకాపల్లి : 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ తర్వాత 'ఉన్నత విద్య ... ఉపాధి, సుస్థిత భవిత' అంశంపై ఏప్రిల్ ఒకటిన ఉదయం 9 గంటలకు అనకాపల్లి శ్రీ గౌరీ గ్రంథాలయంలో ఉచిత అవగాహన సదస్సు జరుగుతుందని గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, ప్రొగ్రాం కన్వీనర్ మళ్ల బాపునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 75 ఏళ్ల ఘన చరిత్ర కలిగి, ఎంతో మందికి విజ్ఞానాన్ని అందిస్తూ ఉపాధి శిక్షణా కేంద్రంగా పేరొందిన శ్రీ గౌరీ గ్రంథాలయం ఆధ్వర్యంలో విశాఖ గ్రామీణ జిల్లాలో మొదటిసారిగా సదస్సు జరుగుతుందన్నారు.

ఒకే రంగం, అందరికీ తెలిసిన కొన్ని కోర్సులపైనే యువతీయువకులు ఎక్కువగా దృష్టి పెడుతున్నారని, దీనివల్ల పోటీతత్వంపెరిగి ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు తగ్గడంతో చాలా మంది జీవితాలు మసకబారుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మారిన విద్యా విధానం, వృత్తి నైపుణ్యతలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్న తరుణంలో విస్తృతమైన అవకాశాలున్నాయన్నారు.

విద్యార్థులు / తల్లిదండ్రులుకు ఏ రంగంలో ఏది చదివితే తరువాత ఏ ఉపాధి అవకాశాలుంటాయో తెలియక సనాతన కోర్సుల చుట్టూనే పయనిస్తున్నారన్నారు.

ఈ నేపథ్యంలో 'ఉన్నత విద్య ... ఉపాధి, సుస్థిత భవిత' అంశంపై నిర్వహిస్తున్న సదస్సుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థలు, సమాజహితులంతా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 92471 87355, 92471 66511 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

# డిగ్రీ మూడో సెమిష్టర్ ఫలితాలు విడుదల




ఆంధ్రవిశ్వవిద్యాలయం: ఏయూ పరిధిలోని డిగ్రీ మూడో సెమిష్టర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం ఉదయం విడుదల చేసారు. వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు పరీక్ష ఫలితాల సిడిని విడుదల చేశారు. అనంతరం ఫలితాలను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో యూజీ పరీక్షల డీన్ ఆచార్య డి.పుల్లారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.వి సుధాకర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు ఆచార్య జి.శశిభూషణ రావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని పాల్గొన్నారు.

బిఏలో 41.27, బికాం(జనరల్)లో 42.94 , బికాం(కంప్యూటర్ అప్లికేషన్స్)లో 40.16, బిఎస్సీలో 41.13 శాతం ఉత్తీర్ణత సాధించారు.

## భక్తి ప్రవత్తులతో

# గుడ్ ఫ్రైడే వేడుకలు



భీమునిపట్నం : భీమిలి లో భక్తి ప్రవత్తులతో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి.క్రీస్తును శిలువ వేసిన దినమును గుడ్ ఫ్రైడే గా క్రైస్తవ సోదరులు జరుపు కుంటారు.ఉదయం నుంచి అన్ని చర్చల్లో ప్రత్యేక ప్రార్దనలు నిర్వహించారు. ఎంతో భక్తి ప్రవత్తులతో తమ కోసం రక్తం చిందించిన క్రీస్తును ప్రత్యేక ప్రార్దనలు కొలిచారు. క్రీస్తు తన చివర గడియలలో అనుబవించిన శ్రమల యాత్రను పుర వీదులగుండా క్రీస్తు పాటలచరిత్ర ను కీర్తనల ద్వారా ధ్యానిస్తూ వాక్యములను చదువుతూ సాగింది. ఈ కార్యక్రమం కేథలిక్ సంఘం చర్చ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో ఫాదర్స జాకబ్ కరాచిరా ,ఎం.ప్రతాప్,సెయింట్ టాన్స సిస్టర్స్, దీపా, మరియా పాల్గొన్నారు.

## నేడు పరవాడలో మంత్రి గంటా పర్యటన

పరవాడ: రాష్టవిద్యాశాఖమంత్రిగంటా శ్రీనువాసురావు పెందుర్తి శాసనసభ్యులు బండారుసత్యనారాయణమూర్తిశనివారము పర్యటించున్నారని మండల పార్టీ అధ్యక్షుడు బొండా సన్నిదేముడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టిపిసి సంస్థ ఒకకోటి యాభై ఐదు లక్షలుతో నూతనంగా నిర్మించిన పభుత్వ జూనియర్ కళాశాల అదనపు భవనాలు ప్రారంభోత్సవం,ఈబోనంగి పంచాయితీలో కేటాయించిన గ్రీనుఫీల్డ్ స్టేడియంకు శంకుస్థాపన అలాగే నూతనంగా మంజూరైనలబ్ధిరాలుకుపించన్లుపంపిణీ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా గంటాశ్రీనువాసురావు, స్థానిక శాసనసభ్యులు బండారు సత్య నారాయణ మూర్తి హాజరు అవుతారని మండలములో గల సర్పంచ్‌లు, ఎంపిటీసిలు, నాయకులు, కార్యకర్తలు విదిగా హజరు కావా లని మండల పార్టీ ప్రెసిడెంట్ బొండా సన్నిదేముడు కోరారు.




### సిపిఎం సీనియర్ నాయకురాలు, మహిళా ఉద్యమనేత

# దండమూరి బిక్షావతి మృతి

## పార్టీకి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు

విశాఖపట్నం: కామ్రేడ్ బిక్షావతి తొలితరం నాయకులకు ఆమె 'చిట్టమ్మ'గానే సుపరిచితం. జీవితం మొత్తం పార్టీ కోసం పాటుపడటమే తెలిసిన పోరాటయోధురాలు ఆమె. దోపిడి, అణిచివేత లేని భారతదేశాన్ని సాధించాలని కోరుకునే వారందరికీ పుచ్చలపల్లి సుందరయ్య గారి బాట వెలుగుబాట. ఆ బాటలోనే నడిచారు బిక్షావతి అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి. లోకనాధం పేర్కొన్నారు. ధనిక రైతు కుటుంబంలో పుట్టినా, నాటి సమాజంలో సాంప్రదాయాల పేరుతో మహిళాలపై జరుగుతున్న అణిచివేతకు వ్యతిరేకంగా, వారి హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాలు, త్యాగాలు నేటి తరానికి నిలువెత్తు స్ఫూర్తి కామ్రేడ్ బిక్షావతి అని అన్నారు. కామ్రేడ్ మోటూరు ఉదయం, మల్లు స్వరాజ్యం, మానికొండ సూర్యవతి వంటి ప్రముఖ మహిళా సంఘాల నాయకులతో కలిసి మహిళా సమస్యలపై ఎనలేని పోరాటాన్ని చేశారన్నారన్నారు. మహిళా కార్యకర్తగా, కార్యదర్శిగా ఎన్నో అనుభవాలను తన ఆస్తిగా మిగుల్చుకున్న బిక్షావతి క్రమశిక్షణకు, సమయపాలనకు మొదటి ప్రాధాన్యత ఇచ్చేవారని ఆమె అందరికీ స్ఫూర్తి ప్రదాన అని కొనియాడారు. అలాంటి పోరాట పటిమ గల అదర్శ కమ్యూనిస్టు నాయకురాలు లేకపోవడం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు. ఆమె మృతికి వారి కుటుంబ సభ్యులకు సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ప్రగాడ సంతపాన్ని తెలియజేస్తున్నదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# శిర్సనగండ్ల రథోత్సవంలో భక్తజనసంద్రం

చారకొండ : రెండో భద్రాద్రిగా పిలిచే శిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవా ల్లో భాగంగా తెల్లవారుజామున రథోత్సవం అత్యంత రమణీయంగా, కనులపండువగా సాగింది. వేకువజామునుంచే వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో శిర్సనగండ్ల ఆలయం భక్తజన సంద్రంగా మారింది. జై శ్రీరాం..జైజై శ్రీరాం నినాదాలతో మార్మోగింది. భక్తుల జయజయ ధ్వానాలు, హర్షాతిరేకాల మధ్య ఈ ఘట్టం మూడు గంటలపాటు కొనసాగింది. కళాకారులు కోలాటాలు, నాటకాలు, ఆటపాటలతో అలంరించారు. రథోత్సవంలో పాల్గొనేందుకు బుధవారం రాత్రి నుంచే భక్తులు గుట్టపైకి చేరుకున్నారు. అక్కడే జాగారం చేశారు. దీంతో ఆలయ వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రథోత్స వానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాదు, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకు నేందుకు బారులు తీరారు. తెల్లవారుజామున పూలతో అలంకరించిన రథాన్ని రామనామ స్మరణతో ఆలయ పరిసర ప్రాంతంలో ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్తు వెలుగులతో ఆ ప్రాంతమంతా శోభాయమానంగా తీర్చిద్దిదారు.



# విజయభాను
## సంపాదకీయం

## రసాయన దాడులు

రష్యాకు, పశ్చిమ రాజ్యాలతో ఉద్రిక్తతలు అనూహ్యామైన రీతిలో తీవ్రస్థాయికి చేరుకోవడం ప్రచ్ఛన్నయుద్ధ కాలాన్ని గుర్తుకు తెస్తున్నది. బ్రిటన్‌లోని గూఢచారి సెర్గీ స్క్రిపాల్ పైనా, ఆమె కుమార్తె పైనా విషవాయు ప్రయోగంతో మొదలైన వివాదం అతి వేగంగా తీవ్రస్థాయికి చేరుకున్నది. ఈ దాడి రష్యా ఏజెంట్లే చేశారనేది బ్రిటన్ ఆరోపణ. తమను ఇరికించడానికి బ్రిటిష్ గూఢచారులే ఈ దాడి చేశారని రష్యా అంటున్నది. తమ గూఢచారులపై దాడిచేశారని ఆరోపించిన బ్రిటన్‌కు అమెరికాతో పాటు నాటో దేశాలు, ఇతర పశ్చిమ దేశాలు సంఘీభావం ప్రకటించాయి. రష్యాపై ఒత్తిడి తేవడానికి ఆ దేశానికి చెందిన దౌత్యవేత్తలను బహిష్కరించడం మొదలుపెట్టాయి. బ్రిటన్ ఇరువైమందికి పైగా దౌత్యవేత్తలను పంపించివేసింది. అమెరికా అరువైమంది దౌత్యవేత్తలను బహిష్కరించడమే కాకుండా, సియాటిల్‌లోని రష్యా దౌత్య కార్యాలయాన్ని మూసివేయించింది. దాదాపుగా 27 దేశాలు రష్యాకు చెందిన 150కి పైగా దౌత్యవేత్తలను పంపించివేయడం సమస్య తీవ్రతను తెలియజేస్తున్నది. తమకు భారీ ఎత్తున సంఘీభావం వ్యక్తం చేయడం పట్ల బ్రిటిష్ సంతృప్తిగా ఉన్నది. తాము యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బయటకు వచ్చినప్పటికీ, ఒంటరిగా లేమని ఈ ఉదంతం ద్వారా తెలుస్తున్నదని బ్రిటన్ ప్రముఖుడు ఒకరు వ్యాఖ్యానించారు. రష్యా మాత్రం గూఢచారిపై విషవాయు ప్రయోగం తాము చేసింది కాదని అంటున్నది. ఈయూ నుంచి బయటకు వచ్చిన తర్వాత బ్రిటన్ అనేక చిక్కులు ఎదుర్కొంటున్నదని, దీనిని నుంచి బయటపడే క్రమంలో ఆ దేశ ప్రధాని థెరీసా మే ఈ పన్నాగాలకు దిగారని రష్యా ఆరోపిస్తున్నది. దౌత్యవేత్తలను బహిష్కరించాలంటూ యూరప్‌లోని చిన్న దేశాలపై అమెరికా ఒత్తిడి తెచ్చిందని, ఆయా దేశాల నాయకులే లోపాయికారిగా ఈ విషయం తమకు చెబుతున్నాయని రష్యా ప్రత్యారోపణ లు చేస్తున్నది. పరస్పర ఆరోపణల సంగతెలా ఉన్నా, రష్యాకు, పశ్చిమ దేశాలకు మధ్య ఉద్రిక్తత తీవ్రస్థాయికి చేరిందనేది మాత్రం తెలుస్తూ నే ఉన్నది. ప్రపంచ యుద్ధాలలో, ప్రచ్ఛన్న యుద్ధకాలంలో గూఢచారుల పాత్ర ఎంతటితో తెలిసిం దే. ఇప్పటికీ రష్యా, నాటో దేశాల మధ్య గూఢచర్యం జోరుగా సాగుతున్నది. ఒక్కోసారి ఒక గూఢచారి తమవర్గమో, శత్రువర్గమో తెలువని విచిత్ర పరిస్థితి ఉంటుంది. సెర్గీ స్క్రిపాల్ 1990 దశకంలో రష్యా గూఢచార అధికారి. 1995 నాటికి రష్యా గూఢచారిగా కొనసాగుతూనే, బ్రిటన్ ఏజెంట్‌గా మారాడు. డబుల్ ఏజెంట్‌గా మారిన విషయం బయటపడటంతో రష్యా లో అరెస్టుచేసి విచారణ జరిపించి జైలులో వేశారు. మరోవైపు అమెరికాలో కూడా రష్యా గూఢచార నెట్‌వర్క్ ఒకటి బయటపడ్డది. రష్యాకు చెందిన పదిమంది స్లీపర్ ఏజెంట్లను అమెరికా గూఢచార అధికారులు అరెస్టు చేశారు. ఒకరి గూఢచారులు మరో దేశంలో మగ్గుతుండే పరిస్థితి ఏర్పడ్డది. దీంతో అమెరికా, రష్యా 2010 జూలైలో గూఢచారుల అప్పగింత కోసం ఒప్పందానికి వచ్చాయి. తమ అధీనంలో ఉన్న పది మంది రష్యా ఏజెంట్లను అమెరికా అప్పగించింది. ఇదేరీతిలో తమ నిర్బంధంలో ఉన్న నలుగురు అమెరికా లేదా బ్రిటన్ గూఢచారులను రష్యా అప్పగించింది. ఈ నలుగురిలో సెర్గీ స్క్రిపాల్ ఒకరు. ఈయన విడుదలైన తర్వాత బ్రిటన్ పౌరసత్వం తీసుకొని అక్కడే స్థిరపడ్డాడు. రష్యాలో ఉంటున్న ఆమె కుమార్తె యూలియా ఇటీవలే తండ్రిని చూడటానికి బ్రిటన్ చేరుకున్నది. ఈ నెల నాలుగవ తేదీన ఇంగ్లండ్‌లోని సాలిస్‌బరీలో ఈ తండ్రి కూతుళ్ళపై విషవాయు ప్రయోగం జరిగింది. ఇప్పుడు ఇరువురు దవాఖానలో చావు బతుకుల మధ్య ఉన్నారు. వీరిపై దర్యాప్తు కోసం పోయిన పోలీసు అధికారిపై కూడా కొంత విషయవాయువు ప్రభావం పడినప్పటికీ, అతడు కోలుకున్నాడు. ఈ హత్యాయత్నమే మళ్ళా రష్యా, పశ్చిమ దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమైంది. స్క్రిపాల్, ఆయన కుమార్తెపై నోవిచోక్ అనే ప్రాణాంతక రసాయన వాయువును ప్రయోగించారనేది వెల్లడైంది. ఈ వాయువు నాడీ మండలాన్ని చచ్చుబార గొడుతుంది. ఈ వాయువు తయారు చేస్తున్నదని రష్యానే అనేది బ్రిటన్ ఆరోపణ. కానీ తాము కాదనేది రష్యా వాదన. అంతర్జాతీయ ఒడంబడికల ప్రకారం రసాయన వాయువులను తయారీ, నిలువ నిషేధం. 1993 నాటి రసాయనిక ఆయుధాల నిషేధ ఒప్పందంపై సంతకం చేసిన అమెరికా 2012 నాటికి తన దగ్గర ఉన్నట్లు ప్రకటించిన నిలువల్లో దాదాపు 90 శాతాన్ని ధ్వంసం చేసింది. రష్యా కూడా 2012 గడువు నాటికి 62 శాతం నిలువలను ధ్వంసం చేసింది. 2017 సెప్టెంబర్ నాటికి నిలువలన్నీ ధ్వంసం చేసినట్టు ప్రకటించింది.

## మోదీ బీజేపీపై కేంద్ర మంత్రి పాశ్వాన్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీపై కొన్ని వర్గాల్లో ఉన్న భావన నుంచి బయటపడేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆ పార్టీ పోరాడుతోందని కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ చెప్పారు. ముస్లింలకు, నిమ్న వర్గాలకు వ్యతిరేకి అనే భావన ఆ పార్టీపై ఉండటం వల్ల రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి నష్టం కలిగించవచ్చునని తెలిపారు. రామ్ విలాస్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ అధినేత. ఈ పార్టీ ఎన్డీయే భాగస్వామి. నరేంద్ర మోదీ మరోసారి ప్రధాన మంత్రి అవుతారని పాశ్వాన్ ధీమా వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్నదంతా ప్రజలందరి కోసమూనని చెప్పారు.

మైనారిటీల కోసం కూడా ఎంతో కృషి చేస్తోందన్నారు. ఎంత గొప్పగా పని చేస్తున్నప్పటికీ బీజేపీపై మైనారిటీలు, సాంఘికంగా వెనుకబడిన వర్గాల్లో ఉన్న అభిప్రాయం మారడం లేదన్నారు.

## శ్రీరామ నవమి హింసాకాండపై అమిత్‌షా కమిటీ

న్యూఢిల్లీ: శ్రీరామనవమి ఊరేగింపు సందర్భంగా పశ్చిమబెంగాల్‌లోని అసాన్సోల్‌లో చెలరేగిన హింసాకాడంపై బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా పార్టీ సీనియర్ నేతలతో కూడిన నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులు బెంగాల్‌లో పర్యటించి ఒక నివేదికను ఆయనకు సమర్పిస్తారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు ఓం మాథుర్, ప్రతినిధి షాన్వాజ్ హుస్సేన్, ఎంపీలు రూపా గంగూలీ, బీడీ రామ్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది.

అంతకుముందు, పశ్చిమబెంగాల్ ఘటనకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీని బీజేపీ తప్పుపట్టింది. రాష్ట్రం తగులబడుతుంటే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడింది. అసాన్సోల్ సమీపంలోని రాణిగంజ్ వద్ద సోమవారంనాడు శ్రీరామ నవమి ఊరేగింపు సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది.

ఈ ఘర్షణల్లో ఒక వ్యక్తిని అగంతకులు నరికి చంపగా, అల్లరిమూక దాడిలో ఒక డిప్యూటీ పోలీస్ కమిషనర్ తన చేతిని కోల్పోయారు.

## 2015 వరల్డ్‌కప్‌లోనూ బాల్ టాంపరింగ్?




ఆక్లాండ్: దక్షిణాఫ్రికాతో మూడో టెస్ట్‌లో ఆస్ట్రేలియా ఆటగాళ్లు బాల్ టాంపరింగ్‌కు పాల్పడి అడ్డంగా దొరికిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా ఆటగాళ్లు 2015 ప్రపంచకప్ ఫైనల్లోనూ బాల్ టాంపరింగ్‌కు యత్నించి ఉంటారని న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ గ్రాంట్ ఇలియట్ అనుమానం వ్యక్తం చేశాడు. న్యూజిలాండ్‌లోని స్థానిక రేడియోషోలో బాల్ టాంపరింగ్ ఉదంతంపై ఇలియట్ మాట్లాడాడు. 2015 ప్రపంచకప్ ఫైనల్లో మా జట్టు ఆరంభం బాగుంది. ఒక దశలో 35ఓవర్లకు 150 పరుగులు చేసి మూడు మాత్రమే వికెట్లు కోల్పోయాం. మరుసటి ఓవర్ నుంచి బంతి రివర్స్ స్వింగ్ తిరగడం ప్రారంభమైంది. అప్పటి వరకు నామమాత్రంగా బౌలింగ్ చేసిన బౌలర్లు బంతిని ఒక్కసారిగా స్వింగ్ చేశారు. ఆ క్రమంలో తాను కూడా బంతిని ఎదుర్కొవడానికి తీవ్రంగా ఇబ్బంది పడినట్లు ఈ మాజీ కివీస్ ఆటగాడు చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో ఇలియట్ 83(133బంతుల్లో) పరుగులతో ఒంటరి పోరాటం చేసి స్కోరుబోర్డును నడిపించే ప్రయత్నం చేశాడు.

అనంతరం న్యూజిలాండ్ నిర్దేశించిన 184పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం మూడు వికెట్లు కోల్పోయి 33.1ఓవర్లలోనే ఛేదించింది.

## మాల్యా పెళ్లికి హాజరుకానున్న తారలు!






లండన్: బ్యాంకులకు అప్పులు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా మూడో పెళ్లి చేసుకోబోతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి.

మాల్యా తాను యాజమానిగా వ్యవహరించిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌లో పనిచేసిన పింకీ లాల్వానీ అనే యువతిని పెళ్లి చేసుకోబోతున్నట్లు తెలుస్తోంది.

అయితే మాల్యా పెళ్లికి బాలీవుడ్ తారలు హాజరుకానున్నట్లు సమాచారం. కింగ్‌ఫిషర్ క్యాలెండర్‌కు మోడల్స్‌గా వ్యవహరించిన దీపిక పదుకొణె, కత్రినా కైఫ్, నర్గిస్ ఫక్రి తదితరులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. మాల్యా కుమారుడు సిద్ధార్థ్‌తో దీపిక కొంతకాలం డేటింగ్‌లో ఉన్నట్లు గతంలో వార్తలు వచ్చాయి.

బ్యాంకులకు రూ.9,000 కోట్ల రుణాలు ఎగ్గొట్టి మాల్యా లండన్‌కు పారిపోయారు. అక్కడకు వెళ్లిన తర్వాత తాను తప్పు చేయలేదని సమర్థించుకునే ప్రయత్నాలు చేశారు. మాల్యాను లండన్ నుంచి భారత్‌కు రప్పించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. లండన్ కోర్టులో కేసు నడుస్తోంది. మాల్యా ఆస్తుల్ని జప్తు చేసిన అక్కడి కోర్టు వారానికి రూ.16 లక్షలు జీవన భత్యం కింద అందిస్తోంది.

## కవి సమయం

### జీవితం

వర్తమానంలో జీవిస్తూ
భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ
ఆశావహ దృక్పథంతో సాగడం ఆవశ్యం
ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు
ప్రణాళికలు, కార్యాచరణ, పట్టుదల,
క్రమశిక్షణ, ముందుచూపు అత్యావశ్యకం
మనోభావాలలో చైతన్యం
ఆలోచనలలో నూతనత్వం
ప్రవర్తనలో దివ్యత్వం
సంబంధిత రీతిలో ఆదర్శవంతమైన
నూతన నిర్ణయాల రూపకల్పన
భిన్నత్వంలో ఏకత్వం
జాతీయ సమగ్రత, సర్వజీవ సమానత్వం
ఉల్లాస, ఆనందభరితమైన జీవితం
అందరి లక్ష్యం, గమ్యం, ఆశయం

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

| మాసం : ఛైత్ర; తిథి: పూర్ణిమ సా.5.50; ఉత్తర ఉ.6.06; హస్త తె.5.57; మ.వ.2.27ల 4.02. | శనివారం 31-03-2018 |
|---|---|

**a మేషం** : వైద్యులకు శస్త్ర చికిత్సల సమయంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. విలువైన వస్తువుల కొనుగోళ్ళ నిమిత్తం ధనం బాగా ఖర్చు చేస్తారు. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసు కోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి.

**b వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యత్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవ టానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు.

**c మిధునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిర చరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ములను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదు రవుతుంది.

**d కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగాదాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం.

**e సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగుతాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవ హారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి.

**f కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టు కుంటారు. ఎప్పటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభ మవు తాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది.

**g తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది.

**h వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగలవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభుత్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది.

**i ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదుర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకు తనం అధికమవుతాయి. ఉపాధ్యా యులకు మంచి గుర్తింపు లభిస్తుంది.

**j మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవు తారు. భార్యాభర్తల మధ్య అవగాహనాలోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది.

**k కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

**k మీనం** :దైవ పుణ్య కార్య క్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి.



## హయగ్రీవావతారం

### సంకీర్తన

సకల చరాచర సృష్టికి కర్త అయిన బ్రహ్మకు శక్తిని ఇచ్చేవి వేదాలే, ఆ వేదాల సంరక్షణలో నిరంతరం మహావిష్ణువు నిమగ్నమై ఉంటాడని, విష్ణుతత్వ మహత్యాన్ని, వేద విజ్ఞాన ఔన్నత్యాన్ని గురించి ఈ కథ తెలియజేస్తుంది. శ్రీ మహావిష్ణువు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం ఎన్నో విధాలుగా ఎన్నెన్నో సందర్భాల్లో అవతరించాడు. తేజోవంతమైన రూపంతో ఆయన హయగ్రీవావతారం పొంది వేదాలను రక్షించాడు. కేవలం వేదోద్ధరణ లక్ష్యంగా హయగ్రీవావతారం కనిపిస్తుంది. పూర్వం శ్రీ మహావిష్ణువు నాభికమలంలో ఆసీనుడై ఉన్న సృష్టికర్త బ్రహ్మ తన పనిలో తాను నిమగ్నమై ఉండగా మధుకైటభులు అనే ఇద్దరు రాక్షసులు గదలను ధరించి మెల్లగా బ్రహ్మదగ్గరకు చేరి మనోహర రూపాలతో భాసిల్లుతున్న నాలుగు వేదాలను అపహరించారు. బ్రహ్మ చూస్తుండగానే అపహరించిన వేదాలతో ఆ దానవులు సముద్రంలో ప్రవేశించి రసాతలానికి చేరారు. వేదాలను కోల్పోయిన బ్రహ్మ వేదాలే తనకు ఉత్తమ నేత్రాలని, వేదాలే తనకు ఆశ్రయాలని, వేదాలే తనకు ముఖ్య ఉపస్యాలని అవి లేకపోతే తాను ˝సృష్టిని చేయడం కుదరదని విచారిస్తూ ఆ ఆపద నుంచి ఎలా బయటపడాలా అని ఆలోచించసాగాడు. ఆయనకు వెంటనే శ్రీమహావిష్ణువు గుర్తుకు వచ్చి పరిపరివిధాల స్తుతించాడు. బ్రహ్మ ఆవేదనను శ్రీహరి గ్రహించి వేద సంరక్షణ కోసం యోగ రూపంతో ఒక దివ్యశరీరాన్ని పొందాడు. ఆ శరీరం చంద్రుడిలా ప్రకాశించసాగింది. ఆ శరీరమే హయగ్రీవ అవతారం అయింది. నక్షత్రాలతో నిండిన ఆకాశం ఆయన శిరస్సుగా మారింది. సూర్యకిరణ కాంతితో ఆయన కేశాలు మెరవసాగాయి. ఆకాశం పాతాళం రెండు చెవులుగా, భూమి లలాటభాగంగా, గంగా సరస్వతులు పిరుదులుగా, సముద్రాలు కనుబొమ్మలుగా, సూర్యచంద్రులు కన్నులుగా, సంధ్య నాసికగా, ఓంకారమే ఆయనకు అలంకారంగా, విద్యుత్తు నాలుకగా, పితృదేవతలు దంతాలుగా, గోలోకం బ్రహ్మలోకం రెండు పెదవులుగా, తమోమయమైన కాళరాత్రి ఆయనకు మెడభాగంగా అలరారాయి. ఈ విధమైన ఒక దివ్యరూపాన్ని ధరించిన శ్రీహరి హయగ్రీవావతారం బ్రహ్మ ముందు నుంచి అంతర్థానమై రసాతలానికి ప్రవేశించింది. అక్కడ హయగ్రీవుడు ఉదాత్త, అనుదాత్త స్వరయుక్తంగా పెద్దగా సామవేదాన్ని గానం చేయసాగాడు. ఆ మధుర గానవాహిని రసాతలం అంతా మారుమోగింది. ఆ గానరసం రసాతలంలో వేదాలను దొంగిలించి దాక్కున్న రాక్షసుల చెవులకు కూడా సోకింది. ఆ గాన రసవాహినికి ఆ రాక్షసులిద్దరు పరవశించి బ్రహ్మ దగ్గర నుంచి తాము తెచ్చిన వేదాలను ఒక చోట భద్రం చేసి గానం వినిపించిన దిక్కుకు పరుగులు తీశారు. అయితే ఇంతలో హయగ్రీవుడు రాక్షసులు దాచిన వేదాలను తీసుకొని సముద్ర గర్భం నుంచి బయటకు వచ్చి అక్కడ ఈశాన్యభాగంలో హయగ్రీవరూపాన్ని విడిచి తన స్వరూపాన్ని పొందాడు. రాక్షసులు గానం వినిపించిన దిక్కుకు బయలుదేరి వెళ్లి ఎంత వెతికినా, ఎక్కడ వెతికినా ఎవరూ కనిపించలేదు. వెంటనే తమ వేదాలను దాచి ఉంచిన ప్రదేశానికి వెళ్లి చూశారు. అక్కడ వేదాలు కనిపించలేదు. వెంటనే ఆ ఇద్దరూ రసాతలం నుంచి వెలుపలికి వచ్చి సముద్రంలో దివ్యతేజ కాంతిపుంజంలాగా ఉండి ఆదిశేషుడి మీద యోగ నిద్రాముద్రలో ఉన్న శ్రీమహావిష్ణువును చూశారు. ఆ రాక్షసులు తాము దాచిన వేదాలను అపహరించింది ఆ శ్వేతపురుషుడేనని, తమ దగ్గర నుంచి వేదాలను తెచ్చినది కాక ఏమీ తెలియనట్లు నిద్రిస్తున్నాడని కోపగించుకొని శ్రీమహావిష్ణువు మీదకు యుద్ధానికి వెళ్లారు. అప్పుడు విష్ణువు ఆ రాక్షసులతో యుద్ధం చేసి వారిని సంహరించాడు. ఇలా హయగ్రీవావతారం వేదోద్ధరణ లక్ష్యంగా అవతరించింది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# కనుల పండుగగా హనుమాన్ శోభాయాత్ర ...

## ర్యాలీని ప్రారంబించిన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ....



కంచరపాలెం: విశాఖ మహనగర్ హనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ విజయ యాత్ర శుక్రవారం కనుల పండగగా నిర్వహించారు. ఈమేరకు జివిఎంసి 38 వ వార్డు పరిది సూర్యనగర్ వద్ద వెలసిన శ్రీ యోగ సిదంజనేయ స్వామి వారి ఆలయం నుండి శోభా యాత్ర సాగింది. కార్యక్రమంలో పాల్గున్న ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు శోభాయాత్ర " ర్యాలీ " ని ప్రారంభించారు.

ఈ సందర్బంగా ఆయన మాట్లడుతూ . నాడు సీతా దేవిని రామనాశ్వరుడు ఎత్తుకెళ్ళి తన రాజ్యంలో బంధించడంతో మహా వీర హనుమాన్

సీతా దేవి ఆచూకీ తెలుసుకొని శ్రీ రాముల వారికీ తెలపడంతో వానరులు ఆనాడు హనుమాన్ ప్రతిభను మెచ్చుకొని విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారన్నారు. అందులో బాగంగా నేడు విశాఖ మహనగర్ హనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం జరుగు తోందన్నారు. ఈర్యాలీ కంచరపాలెం మీదుగా అక్కయపాలెం 80 అడుగుల రోడ్డు నుండి సీతమ్మపేట, గురుద్వార్, బాలయ్య శాస్త్రి లే అవుట్ , కే .ఆర్ .ఎమ్.కాలనీ, హెచ్.బి.కాలనీ, క ృష్ణ కాలేజ్ , ఎమ్ .వి.పి.డబల్ రోడ్, ఉషోదయ జంక్షన్, బీచ్ రోడ్, పార్క్ హెటల్, వై ఎమ్.సి.ఎ రామకృష్ణ బీచ్ నుండి నోవటల్ హెటల్ వరకు ర్యాలీ నిర్వహిస్తా మన్నారు. కార్యక్రమానికి నియోజక వర్గం పరిది నుండి సుమారు నాలుగు వేల మంది ప్రజలు ర్యాలీ లో పాల్గున్నారన్నారు. కార్యక్రమంలో బాగంగా హనుమాన్ చాలీసా పారాయణం గావించారు. అంతకు ముందు ర్యాలీ ప్రారంబించిన ఆయన శ్రీ యోగ సిద్ధాంజనేయ ఆలయంలో కొలువైవున్న స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బిజెపి నగర ఉపాధ్యక్షురాలు శ్యామల దీపిక, బిజెపి ఉత్తర నియోజకవర్గం కన్వీనర్ డాక్టర్ సురేష్ సామయాజులు, శివాజి బహాదుర్, ఉత్సవ కమిటి సభ్యులు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ బారిన పడకుండా బాలలను కాపాడుకుందాం

## పంచాయతీల్లో క్రాఫ్ విస్తృత ప్రచారం



నర్సీపట్నం : వేసవి కాలంలో బాలలు వడదెబ్బ బారిన పడకుండా గ్రామాల్లో సర్పంచ్‌లు తగిన ఏర్పాట్లు చేసి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని నర్సీపట్నం క్రాఫ్ ప్రతినిధి బికెఎం.హిల్డెన్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సీపట్నం డివిజన్‌లో గల గొలుగొండ మండలం కొంగసింగి, నాగాపురం, చోద్యం, నర్సీపట్నం మండలంలో గల ధర్మసాగరం, ఒఎల్‌పురం పంచాతయీ సర్పంచ్‌లకు వడదెబ్బ వలన కలిగే అనర్ధాలపై కూడిన కరపత్రంతో పాటు సర్పంచ్‌లకు వినతి పత్రంఅందించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రొచైల్డ్ గ్రూపు, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాఫ్ నర్సీపట్నం డివిజన్ ప్రతినిధి హిల్డెన్ మాట్లాడుతూ వడదెబ్బకు ముందుగా బాలలకు శరీర ఉష్ణోగ్రత పెరుగు తుందన్నారు. శరీర అధిక వేడి వలన కొన్ని అవయవాలు దెబ్బతిని జీర్ణక్రియలు పని చేయడం మానేస్తాయన్నారు. వడదెబ్బ బారినపడిన వారికి చెమటలు పట్టడం, తలనొప్పి శరీరం మొక్క ఉష్ణోగ్రత పెరగడం చర్మ సమస్యలు, వికారం, శ్వాసతీసుకోవడంలో సమస్య ఉంటుందన్నారు. పంచాయతీల్లో కూడా సర్పంచ్‌లు తగిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాలలు వడదెబ్బ బారిన పడకుండా చూడాలన్నారు. కరపత్రాలను గ్రామాల్లో పంపిణీ చేశారు. పంచాయతీల్లో వడదెబ్బలపై తగిన ముందస్తు చర్యలు చేపడతామని ఈ సందర్భంగా సర్పంచ్‌లు హామీ ఇచ్చారు.

# ప్రాంతీయ అభివృద్ధే లక్ష్యం

విజయనగరం : ప్రాంతీయ అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ సంఘం ఏర్పడిందన కె.ఎల్.పురం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.పార్ధసారధి పేర్కొన్నారు. శుక్రవారం సంఘ సర్వసభ్య సమావేశం కె.ఎల్.పురం హనుమాన్ ఆలయంలో జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షుడు పార్ధసారధి మాట్లాడుతూ కాలనీలో వివిధ ప్రాంతాలకు సిమ్మెంట్ రోడ్ల నిర్మాణం కాల్వల పునరుద్ధరణ, పూడికతీత పనులు నిర్వహించవలసి ఉందన్నారు. ఈ పనుల నిర్వహణకు కమిటీ ప్రతినిధులంతా సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ సర్పంచ్ కంది రాంబాబు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కమిటీకి స్థానిక రాజకీయాలకు ఏవిధమైన సంబంధం లేదన్నారు.

ఈ సమావేశంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కన్నం నాయుడు, లచ్చిరెడ్డి వెంకటనాయుడు, వేణుగోపాల్‌తో పాటు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతీనెల సమావేశం నిర్వ హించి అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించేందుకు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది.

## కన్నుల పండువగా నృత్యోత్సవం



విజయనగరం: ప్రముఖ భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో గల అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన నృత్యోత్సవం కన్నుల పండువగా సాగింది. ఎం.మానస జ్యోతి, కె.వి.ఎస్.మోహనిక, కె.వి.ఎస్.ప్రియాంకల నృత్యదర్శకత్వంలో శ్రీసాయిలలితా నృత్య కళానికేతన్‌కు చెందిన 10 మంది చిన్నారులు తమ నృత్యంతో ఆకట్టు కున్నారు. కృష్ణం కలయ సఖి సుందరం, గణనాయక, అష్ట లక్ష్మీ వైభవం తదితర నృత్యాలకు చిన్నారులు తేజస్వి, నిఖిత, మోహనసాయి, శైలజ,తేజస్విని, రేణుక, చాందిని, షర్మిల తదితరులు చక్కటి నృత్య ప్రదర్శన గావించారు.

# జోనల్ కమిషనర్ కు వినతి పత్రం



భీమునిపట్నం : భీమిలి డివిజన్ లో వున్న సమస్యల పై జోనల్ కమిషనర్ బి సన్యాసి నాయుడుకు భీమిలి డివిజన్ తెలుగుదేశం పార్టీ అద్యక్షులు గంట నూకరాజు వినతిపత్రం అందజేసారు. భీమిలి డివిజన్ జోన్ పరిధి లో మంచినీటి బోర్ లలో నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే బాగు చేయాలని ,భీమిలి పుర విధుల్లో మలేరియా మరియు డెంగ్యూ వంటి వ్యాదులు వ్యాప్తి చెందడంవలన ప్రజలు ఆనారోగ్యాల బారిన పడుతున్నారని, అలాగే భీమిలి లో కుక్కలు పందులు బెడత ఎక్కువుగా వున్నాదని పిచ్చి కుక్క ఇప్పటికే సుమారు పది మందిని కరిచిందని.వెంటనే వాటి పై చర్యలు తీసుకోవాల్ని, భీమిలి డివిజన్ ఏరియాల్లో మంచినీటి కొరత చాలా ఎక్కువు గా వున్నాదని మంచి నీటి ని ట్యాంక్ ల ద్వారా పంపిణి చెయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి డి.పి నాయుకులు గాడు. సన్యాసి నాయుడు, పి.యోగి, దాసరి. వెంకటేష్, అప్పికొండ.నూకరాజు కనకల అప్పలనాయుడు, మారోజు సంజీవ్, గిడుతూరి శ్రీనివాసరావు, కె.కృష్ణారావు, కాసరపు.నాగరాజు, కె.శంకర్, వి.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాయామ పరికరం వితరణ



భీమునిపట్నం : స్థానిక మండల పరిషత్ ఆవరణలో దివ్యాంగ చిన్నారులకు కోసం నిర్వహిస్తున్న భవిత కేంద్రానికి దీవిస్ సంస్థ రూ35 వేలు విలువ చేసే వ్యాయామ పరికరంను ఎం.పి.పి.యం బాల క ృష్ణవేణి చేతుల మీదగా భవితా కేంద్రానికి అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎం.ఇ.ఓ.బాలమణి,ఎం. పి.డి.ఓ.హరి ప్రసాదరావు, ఈ ఓ పి.ఆర్డి కుమార్,జెడ్పిటిసి సరగడ అప్పారావు, దీవిస్ ప్రతి నిధులు ఇ.ఎస్.నాగరాజు, పి.పైడి నాయుడు, అనీల్ ప్రసాద్, మండల పరిషత్ విస్తరణ అధికారి కుమార్, భవిత కేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

## ఎండతీవ్రతకు ముందుగానే

# పింఛన్లు పంపిణీ చేయాలి

## డిఆర్‌డిఎ పిడి సుబ్బారావు

విజయనగరం : వేసవిని దృష్టిలో ఉంచుకొని పించన్లు పంపిణీ సాఫీగా జరశ్రీనగాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయని డిఆర్‌డిఎ పథక సంచాలకులు కె.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. పించన్లు పంపిణీకి వార్డులవారీగా, గ్రామాల వారీగా నిర్ణీత సమయాన్ని, స్థలాన్ని నిర్దేశించాలన్నారు. ఎండ తీవ్రత పెరగక ముందు ఉదయం సమయంలో పంపిణీ చెయ్యాలన్నారు. కేంద్రాల వద్ద తగినంత త్రాగునీరు అందుబాటులో ఉంచాలని, అత్యవసర వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాలకు రాలేని వృద్ధులకు,వికలాంగులకు ఇంటి వద్దకు నేరుగా వెళ్లిపంపిణీ చెయ్యాలన్నారు. పించన్లు పంపిణీదారులకు తగు సూచనలు ఇవ్వాలని మండల అభివృద్ధి అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు.

## గురాన కుటుంబం వితరణ

విజయనగరం:ప్రముఖ వ్యాపారవేత్త, ధార్మికవేత్త గురాన సాధూరావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్ధం గురాన కుటుంబీకులు 25 వేల రూపాయల వితరణ గావించారు. శుక్రవారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా గల రాజా ఇంటర్నేషనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా పెదతాడివాడలో నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయ నిర్మాణ నిమిత్తం ఆ దేవాలయం అధ్యక్షులు పి.రామారావుకు 25వేల రూపాయల నగదును పెనుమజ్జి విజయ లక్ష్మి, మీసాల శ్రీనివాసరావులు అందచేసారు. ఈ కార్యక్రమంలో గురాన అప్పలనరసమ్మ, మీసాల గీత, అచ్యుతాంబ, అరుణకుమారి, దీపామణి, గురాన అయ్యలు, రాధిక, లుక్కునాథ్, భరత్, భూపతి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు



ర్యాలీ వెళ్తున్న క్రైస్తవులు

నర్సీపట్నం : నర్సీపట్నంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు అత్యంత ఘనంగా క్రైస్తవ సోదరులు నిర్వహించారు. పెదబడ్డేపల్లి ఆర్‌సిఎం చర్చి, సిబిఎం కాంపౌండ్ వద్ద పెంతికొస్తు చర్చిలో వేడుకలు జరిగాయి. ప్రత్యేర ప్రార్ధనల అనంతరం ర్యాలీగా పురవీధుల్లో తిరిగారు. ఫాస్టర్లు గుడ్‌ఫ్రైడే విశిష్టతను తెలియజేశారు.

## లుఫిన్‌ఫార్మా ఆర్ధిక సహాయంతో

# పరవాడ కోనాంకు మహర్ధశ

## విజయభాను ప్రతినిధితో పరవాడ సర్పంచ్ చుక్క



పరవాడ:మండల కేంద్రమైన పరవాడ సంతబయలను ఆనుకోని వున్న కోనాం (చెరువు)ను అభివృద్ధి చేసేందుకుగాను లుఫిన్ ఫార్మా యాజమాన్యం ముందుకు వచ్చింది అని పరవాడసర్పంచ్ చుక్క రాము నాయుడు తెలిపారు. శుక్రవారము ఆయన తన స్వగ్రహంలో విజయ భాను ప్రతినిధితో మాటా ్లడుతూ పరవాడ కోనాం(చెరువు) అభివృద్ధి నిమిత్తము లుఫిన్ ఫార్మా యాజమాన్యం ఆర్ధిక సహాయంతో మొదటి విడుతగా పన్నెండు లక్షలు రూపాయలు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. ఇందులో పార్క్ అభివృద్ధితో పాటు వాక్‌ట్రాక్, స్టోనీ పిచ్చింగును ఏర్పాటు చేస్తామని అన్నారు. కోనాంను సుందరీకరణ చేపేట్టేందుకు లుఫిన్ కంపెనీ యాజమాన్యం ముందుకు రావడం అభినంద నీయమని అన్నారు. కొనాం (చెరువును)ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రెండో విడతగా మరో ఇరవై లక్షలు రూపాయలు మంజూరు చేస్తామని లుఫిన్ యాజమాన్యంహమీ ఇచ్చినట్లు సర్పంచ్ చుక్కరామునాయుడు తెలిపారు. పరవాడ గ్రామం తరుపున లుఫిన్ యాజమాన్యనికి పరవాడ సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

# వంతెన పైనుండి పడి లారీ బోల్తా

చీడికాడ: మండలంలో గల బిఎన్ రోడ్డులో విజయ రామరాజుపేట తాచేరు వంతెనపై నుండి లారీ బోల్తా పడి డ్రైవరుకు తీవ్రగాయాలయ్యాయి. గోవాడ షుగర్ ఫ్యాక్టరీ నుండి రోలుగుంట చెరకు కాటాకు వెళ్తున్న లారీ తాచేరు వంతెన దగ్గర అదుపు తప్పి వంతెన బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి వంతెన రక్షణ గోడను ఢీకొట్టి వంతెన కింద లారీ పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. లారీ వంతెన కింద పడినప్పుడు పెద్ద శబ్ధం రావడంతో స్థానికులు పరుగున సంఘటనా స్థలానికి తరలి వచ్చారు. ప్రమాదంలో డ్రైవర్‌కి కాలు విరిగి ప్రాణాపాయం నుండి తప్పించుకున్నాడు. డ్రైవర్‌ను విశాఖ ఆసుపత్రికి తరలించారు.

## రావ్ ట్రావెల్స్ నూతనశాఖ ప్రారంభం

విశాఖపట్నం: మన దేశ పర్యాటక రంగంలో నలభై సంవత్సరాలుగా అత్యద్భుతమైన సేవలందిస్తూ, అగ్రగామి సంస్థగా వెలుగొందుతూ ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక సంస్థ రావ్ ట్రావెల్స్, మన విశాఖపట్నం ద్వారకానగర్‌లో శుక్రవారం తమ నూతనశాఖను ప్రారంభిస్తోంది. ఈ సందర్భంగా రావ్ ట్రావెల్స్ సంస్థ డైరెక్టర్ పి.సుధాకరరావు విలేకర్లతో మాట్లాడుతూ విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, గోదావరి జిల్లాల నుండి ఇటీవల కాలంలో పర్యాటకుల సంఖ్య బాగా పెరిగిందని అన్నారు. అందు కోసం ఈ ప్రాంతాల వారికి మరింత మెరుగైన సేవలం దించాలనే ఉద్ధేశ్యంతో విశాఖలో నూతన బ్రాంచి ప్రారంభిం చామన్నారు. నెల్లూరు, చెన్నై, బెంగుళూరులోని సొంత బ్రాంచీలతో పాటు దేశ విదేశాలవ్యాప్తంగా తమ అనుబంధ సంస్థలతో విస్తరింపబడ్డ కస్టమర్లకు డొమస్టిక్ & ఇంటర్నేషనల్ టూర్స్, హోటల్స్ & రిసార్ట్స్, ఫ్లైట్, టికెట్స్, వీసా అసిస్టెన్స్, గ్రూప్ టూర్స్, ఫ్యామిలీ టూర్స్, హనీమూన్ ప్యాకేజెస్ సరసమైన రేట్లకు అందిస్తామని అన్నారు.

## నెలాఖరు నాటికి మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

రావికమతం : నెలాఖరు నాటికి మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి శివరాంప్రసాద్ సూచించారు. గురువారం రాత్రి చినపాచిలలో జరిగిన పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రతీ వీధిలోకి వెళ్లి మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామంలో 542 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు కాగా, 530 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు.

# 'దేశం' విలువలకు తిలోదకాలిచ్చింది

## వై.యస్సార్ పార్టీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం: తెలుగుదేశం నాయకులు విలువలకు తిలోదకాలిచ్చి , రాజకీయపబ్బం గడుపుకోవడానికి ఎప్పటికప్పుడు మాటలు మార్చుతూ ప్రజలను మోసగించే విధానాలకు స్వస్తి పలకాలని వై.యస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయకీయ వ్యవహారాల జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చినశ్రీను) హితవు పలికారు. చంద్రబాబునాయుడు పొంతనలేని మాటలు చెప్పడం రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించడమేనని పద్నాల్గువ ఆర్ధిక సంఘం రాష్ట్రానికి ప్రత్యేకహెూదా ఇవ్వడం సాధ్యం కాదని చెప్పినప్పుడు చంద్రబాబునాయుడు ప్రత్యేకహెూదా పదేళ్లు, పదిహేనేళ్లు కావాలని ఎలా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక సత్యాకార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఆనాడు నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి ఢిల్లీ పెద్ధలను గడగడలాడించిన పరిస్థితికి భిన్నంగా నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుగువారి ఆత్మగౌరవాన్ని డిల్లీ పెద్ధలకు తాకట్టు పెట్టారని, తెలుగువారి పరువుగంగలో కలిపారని ఆయన దుయ్యబట్టారు. ప్రత్యేకహెూదా విషయంలో ముందు ప్యాకేజీ కావాలన్న ఆయన వైకాపా చేస్తున్న ప్రత్యేకహెూదా పోరుకు లభిస్తున్న ప్రజల మద్దతు చూసి చంద్రబాబునాయుడు యుూటర్న్ తీసుకొని ఇప్పుడు ప్రత్యేకహెూదా కోసం పోరాటమని చెప్పడం ఆయనలోని రెండునాల్కుల దోరణి కన్పిస్తుందన్నారు.తెలుగుదేశం నేతలు గురువారం నిర్వహించిన ఆపార్టీ ఆవిర్భావదినోత్సవం నల్లబ్యాడ్జీలు పెట్టుకొని నిరసన పాటించడమంటే హాస్యాస్పదంగా ఉందని ఎన్.టి.ఆర్. రూపొందించిన ఆపార్టీ ఆశయాలు, సిద్దాంతాలు, ఆలోచనలు మీరు పాటిస్తున్నారా అని చినశ్రీను దేశం నేతలను నిలదీశారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలి తప్ప వ్యక్తిగత విమర్శలు , చౌకబారు మాటలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్ వైకాపా ఎం.పి. విజయసాయిరెడ్డిని రాళ్లతో కొట్టాలని పిలుపునివ్వడం రాజకీయ విలువలకు వలు వలూర్చడమేనని ఇటువంటి ప్రకటనలు పునరావృత్తమైతే సహించేది లేదని చినశ్రీను హెచ్చరించారు. బొబ్బిలికోటలో మంత్రి సుజయకృష్ణరంగారావు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావదినోత్సం నిర్వహించడం చూస్తుంటే ఆ పార్టీ నిభందనలు, నియమాలు, ఎన్.టి.ఆర్ ఆలోచన విధానాలు మంత్రికి తెలుసా అని ఆయన నిగ్గదీశారు. పేదవాడికి కూడు, గూడు తెలుగువారి ఆత్మగౌరవం, నమ్మిన సిద్దాంతానికి కట్టుబడడం వంటివి ఎన్.టి.ఆర్.ఆలోచనలైతే ఇందులో ఏవైనా మంత్రికున్నాయా అని శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు.రాజకీయాలలో నైతికవిలువలు కలిగి వ్యక్తుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించే విధంగా ఉండాలని ఆయన ఉద్బోదించారు. విజయనగరం పార్లమెంటరీ పార్టీ అద్యక్షులు బెల్లాన చంద్రశేఖర్‌మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేకహెూదా ఒక్కటే మార్గమని అందుకు వైకాపా రాష్ట్ర అద్యక్షులు వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి విలువలతో కూడిన రాజకీయం చేస్తూ, రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు కట్టుబడి ప్రత్యేకహెూదా అనే ఒకేమాటతో ముందుకు వెల్తూన్నారని చంద్రశేఖర్ పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు రెండునాల్కుల దోరణితో పొంతనలేని ప్రకటనలు చేస్తున్నారని రాష్ట్రవిభజన సమయంలోకూడా ఆయన తన రెండుకళ్లు సిద్దాంతాన్ని ప్రదర్శించారని చంద్రశేఖర్ తప్పు పట్టారు. తన ఎంపీలతో రాజీనామాలు చేయిస్తే దానివలన ఉప ఎన్నికలు వస్తే గెలవలేమన్న భయం చంద్రబాబునాయుడులో ఉందని చంద్రశేఖర్ అభిప్రాయ పడ్డారు.సమావేశంలో డిసిసిబి ఉపాధ్యక్షులు చనుమల వెంకటరమణ, పార్టీనాయకులు ఎం.ఎల్.ఎన్.రాజు, కనకల రఘురామారావు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ విశాఖపట్నం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో**

**G.O.P.248/2018**

మరుపిళ్ళ మహేశ్వరరావు ...పిటిషనరు

మరియు

Nil ...రెస్పాండెంట్లు

ప్రకటన

యిందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటిషనరు అయిన మరుపిళ్ళ మహేశ్వరరావుగారు మైనరు కుమారుడైన మరుపిళ్ళ బాందవ్‌కు గార్డియను, సంరక్షకుడుగా వ్యవహరిస్తూ షెడ్యూలు దాఖలా ఆస్తిని మైనరు కుమారుడైన మరుపిళ్ళ బాందవ్ ఎడ్యుకేషను మెడికల్ సీటు నిమిత్తం మరియు వెల్ఫేరు వగైరాల నిమిత్తం షెడ్యూలు దాఖలా ఆస్తిని ఇతరులకు అమ్ముటకుగాను, పర్మిషను ఇప్పించగోరి పిటిషనరు పై నెంబరు పిటిషను పై కోర్టులో దాఖలు చేసియున్నాడు. అందు విషయమై ఎవ్వరికైననూ ఎట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల వాయిదా అయిన **తే 24-04-2018దీ పగలు 10-30 నిIIలకు** స్వయంగా గాని, లాయరుగారి ద్వారా గాని పై కోర్టులో హాజరయి ఎట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల వాయిదా రోజున శ్రీ కోర్టు వారి ఎదుట తెలియపర్చుకోవలెను. అట్లు ఎవరైనా హాజరు కాని ఎడల మీ పరోక్షమందు తీర్మాణించడమగునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు :- **All that Vacant Land measuring 200 Sq.yards, of Plot No.113 situated in S.No.166/2 part of Tallavalasa Village, with in Sub-District of (SRO) Anandapuram, Bheemunipatnam Mandal, Visakhapatnam - District, approved L.P.No.45/2013, in NANDANAVANAM-II**

**bounded as follows:**
**East :- Plot No-114**
**South :- 40' Road**
**West :- Plot No-112**
**North :- Plot No-116**

పిటిషనరు తరపు న్యాయవాదులు.

**A.Prabhakar Reddy**
**P.Anjaneya Murthy**
**Abhimanyu Apartments**
**Eastpoint Colony,**
**Visakhapatnam-17.**
**Cell : 9949425399**

# చిత్రభాను




మెగా ఫ్యామిలీ వారసుడిగా వెండితెరకు పరిచయమైన రామ్‌చరణ్ తొలి నుంచి తనదైన శైలిలో చిత్రాలను చేస్తూ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు. మాస్, కమర్షియల్ హీరోగా తనకు తిరుగులేదని నిరూపించుకున్నారు. ఇక దర్శకుడు సుకుమార్‌ది విభిన్న శైలి. కొత్తదనం ప్లస్.. అనవసర సన్నివేశాలు మైనస్.. ఎమోషన్స్ ఇంటూ.. కథ డివైడెడ్ బై.. స్క్రీన్‌ప్లే స్క్వేర్ రూట్.. ప్లస్ ఐటమ్ సాంగ్. ఇది సుకుమార్ సినిమా ఈక్వేషన్. మరి వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటే 'లెక్కలు' ఏ స్థాయిలో ఉంటాయో చెప్పనక్కర్లేదు. అంతటి భారీ అంచనాలతో శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'రంగస్థలం'. 1985లో 'రంగస్థలం' అనే గ్రామంలో జరిగిన రాజకీయ చదరంగం ఇతివ ృత్తంగా సినిమా సాగుతుందంటూ ప్రచారం చేశారు. పైగా చరణ్ ఇందులో చెవిటివాడిగా నటించడం మరో విశేషం. మరి చరణ్-సుకుమార్‌ల కొత్త ప్రయత్నం ఎలా ఉంది? చరణ్ ఏడాదికి పైగా పడిన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందా? ఆయన కెరీర్‌లో మరో మైలురాయిలా నిలిచే చిత్రమైందా?

కథేంటంటే: రంగస్థలం అనే గ్రామానికి ప్రెసిడెంట్ ఫణీంద్ర భూపతి(జగపతిబాబు). 30ఏళ్లుగా ప్రెసిడెంట్ పదవిలో ఉంటాడు. మరొకరికి అవకాశం ఇవ్వడు. గ్రామంలో అతను చెప్పిందే వేదం. అతని పేరు పలకడానికి కూడా జనం భయపడుతుంటారు. ప్రెసిడెంట్ ఇంటి ముందు నుంచి వెళ్లాలన్నా చెప్పులు విడిచి వెళ్లాలి. ఇదే గ్రామంలో పొలాలకు నీరు పెట్టే ఇంజిన్‌ను నడుపుతూ ఉంటాడు చిట్టిబాబు(రామ్ చరణ్). అతడికి చెవుడు. పెద్దగా వినిపించదు. గ్రామంలో అందరితోనూ సరదాగా ఉంటాడు. తండ్రి(నరేష్) గ్రామంలో దర్జీ. అన్న కుమార్‌బాబు(ఆది) చదువుకుని దుబాయ్‌లో ఉద్యోగం చేసి వస్తాడు. అదే ఊరిలో ఉండే రామలక్ష్మి(సమంత)కి చిట్టిబాబు అంటే ఎంతో ఇష్టం. గ్రామంలోని అమాయక రైతులను తన సహాయకుడితో కలిసి ఫణీంద్రభూపతి మోసం చేస్తూ ఉంటాడు. అలా రామలక్ష్మి(సమంత) తండ్రిని మోసం చేసి డబ్బు కట్టాల్సిందిగా ఆదేశిస్తాడు. ఈ విషయంలో కుమార్‌బాబుకి ప్రెసిడెంట్ సహాయకుడికి మధ్య గొడవ జరుగుతుంది. మరి ఆ గొడవ దేనికి కారణమైంది? ఎలాంటి పరిణామాలకు దారి తీసింది? 'రంగస్థలం' గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కుమార్‌బాబు ఎందుకు నామినేషన్ వేయాల్సి వచ్చింది? తన అన్నకు అండగా నిలిచిన చిట్టిబాబు ఏం చేశాడు? అన్నదే కథ.



ఎలా ఉందేంటే: ఇది 1985 నాటి కాలంలో సాగే కథ. భూస్వామ్య వ్యవస్థ.. ఒకే వ్యక్తి చేతిలో అధికారం ఉండటం.. 30ఏళ్లుగా గ్రామాన్ని పాలిస్తున్న ఓ ప్రెసిడెంట్ చేసే అరాచకాలను నిలదేసే ఓ యువకుడు.. ఇదీ స్థూలంగా రంగస్థలం నేపథ్యం. ఈ కాన్సెప్ట్ గతంలో ఎన్నో చిత్రాల్లో మనం చూసే ఉంటాం. అయితే ఇలాంటి కథకు సుకుమార్ శైలిని జోడిస్తే ఎలా ఉంటుందో అదే 'రంగస్థలం'. కథ పరంగా పాత్రల ఎంపిక, వాటిని చిత్రీకరించిన విధానం, ఆకట్టుకుంటుంది. కమర్షియల్ సినిమాలకు దూరంగా పూర్తి గ్రామీణ వాతావరణంలో సాగుతుంది. ఇలాంటి వాతావరణం ఎక్కువగా తమిళ సినిమాల్లో ఉంటుంది.

ప్రథమార్ధమంతా ఊళ్లో చిట్టిబాబు చేసే సందడి.. రామలక్ష్మితో వచ్చే సరదా సన్నివేశాలతో సరదా సరదాగా సాగిపోతుంది. ముఖ్యంగా రామలక్ష్మిగా సమంత నటన ఆకట్టుకుంటుంది. ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు నవ్వులు పంచుతాయి. పాటలు కూడా సన్నివేశాలకు తగ్గట్టుగా వచ్చిపోతుంటాయి. మరోపక్క గ్రామంలో ప్రెసిడెంట్ చేసే అన్యాయాలను కుమార్‌బాబు నిలదీయడంతో అతని తండ్రిని, నాయనమ్మను ప్రెసిడెంట్ మనుషులు అవమానిస్తారు. అయితే చిట్టిబాబుకు సరిగా వినకపడకపోవడం ఈ పరిణామాలేవీ తెలియవు. తన తండ్రిని, నాయనమ్మను అవమానించారని స్నేహితుల ద్వారా తెలుసుకున్న చిట్టిబాబు ప్రెసిడెంట్ మనుషులతో గొడవపడి జైలుకు వెళ్తాడు. దీంతో కుమార్‌బాబు ఎమ్మెల్యే దక్షిణామూర్తి(ప్రకాశ్‌రాజ్) సాయంతో చిట్టిబాబును బెయిల్‌పై విడిపిస్తాడు. అనంతరం గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కుమార్‌బాబు నామినేషన్ వేస్తాడు. ఆ తర్వాత ఏం జరిగిందనేది ద్వితీయార్థం. పాత్రల పరిచయం వాటిని ఎస్టాబ్లిష్‌మెంట్ చేసే క్రమంలో ప్రథమార్ధం కాస్త నెమ్మదిగా సాగుతుంది. కథను మరింత విపులంగా చెప్పే క్రమంలో దర్శకుడు ఇలా ఆలోచించి ఉండవచ్చు.

ప్రథమార్ధమంతా సరదా సన్నివేశాలతో నడిపించిన దర్శకుడు అసలు కథను ద్వితీయార్థం కోసం అట్టిపెట్టుకున్నాడు. కుమార్‌బాబు నామినేషన్ వేయడం, ప్రెసిడెంట్ అరాచకాలను ఊరి వాళ్లకు తెలియజేయడం, ఎన్నికల ప్రచార కార్యక్రమాలు తదితర సన్నివేశాలతో సెకండాఫ్‌ను తీర్చిదిద్దాడు దర్శకుడు. అక్కడి నుంచి కథలో కాస్త వేగం పెరుగుతుంది. ఆ తర్వాత వచ్చే ట్విస్టులు ప్రేక్షకుడిని ఆశ్చర్య పరుస్తాయి. ఇలా ద్వితీయార్థం మొత్తం సుకుమార్ శైలి ట్విస్ట్‌లతో సాగుతుంది.



ఎవరెలా చేశారంటే: చిట్టిబాబుగా రామ్‌చరణ్ ఒదిగిపోయారు. గోదావరి యాస.. చెవిటి వ్యక్తిగా అతను పండించే నవ్వులు ప్రేక్షకులను అలరిస్తాయి. ఇప్పటివరకూ చరణ్ నటించిన చిత్రాలన్నీ ఒక ఎత్తయితే 'రంగస్థలం'లో చిట్టిబాబు పాత్ర మరో ఎత్తు. పాత్ర కోసం రామ్‌చరణ్ పడిన కష్టం తెరపై స్పష్టంగా కనిపిస్తుంది. చెవిటి వ్యక్తిగా ప్రియురాలి వద్ద తడబడే సన్నివేశాల్లో నవ్వులు పంచిన చెర్రీ ద్వితీయార్థంలో అన్నకోసం తపన పడే తమ్ముడిగా భావోద్వేగాలను పలికించడంలో నూటికి నూరుపాళ్లు విజయవంతమయ్యారు. కొన్ని రోజుల వరకూ రామ్‌చరణ్ చిట్టిబాబుగానే మనకు గుర్తుండిపోతారు. రామలక్ష్మిగా తన నటనతో మరోసారి కట్టిపడేశారు సమంత. సుకుమార్ చిత్రాల్లో కథానాయిక పాత్ర బలంగా ఉంటుంది. ఈ చిత్రంలో సమంత పాత్ర చాలా కీలకం. పల్లెటూరి అమ్మాయిగా ఆమె నటన ఆకట్టుకుంటుంది. కుమార్‌బాబు పాత్రలో ఆది ఇమిడిపోయారు. మ ృదు స్వభావిగా.. గొడవలకు దూరంగా ఉంటూనే అన్యాయంపై పోరాటం చేసే వ్యక్తిగా చక్కగా నటించారు. ప్రెసిడెంట్‌గా జగపతిబాబు, ఎమ్మెల్యేగా ప్రకాశ్‌రాజ్ ఇలాంటి పాత్రలు కొట్టిన పిండే. సినిమాలో రంగమ్మత్తగా అనసూయ పాత్ర ఓ ట్విస్ట్. సుకుమార్ ఎంపికకు ఆమె న్యాయం చేశారు. ఆ పాత్రలో చక్కగా నటించారు.



ఈ సినిమాకు ప్రధాన బలం సంగీతం. సుకుమార్-దేవిశ్రీ ప్రసాద్‌ల కాంబినేషన్ హిట్ అని మరోసారి 'రంగస్థలం' నిరూపించింది. ప్రతీ పాట.. సన్నివేశంతో పాటే వస్తుంది. ఎక్కడా ఇరికించిన భావన ఉండదు. సుకుమార్-దేవిల మార్కు ఐటమ్‌సాంగ్‌లో పూజా హెగ్డే అలరిస్తుంది. ఇక ఈ సినిమాకు మరో ప్రధాన బలం సెట్స్. 1985నాటి నేపథ్యంలో కనిపించేలా రామక ృష్ణ తీర్చిదిద్దిన సెట్స్ మనల్ని ఆకాలం నాటికి తీసుకెళ్తాయి. ప్రతీ సన్నివేశంలో ఆ నాటి పరిస్థితులను ప్రతిబింబించేలా వాతావరణం స ృష్టించారు. అదంతా తెరపై కనిపిస్తుంది. సినిమా నిడివి ఎక్కువైనా ప్రతీ సన్నివేశానికీ ప్రాధాన్యం ఉంది. దీంతో నవీన్ నూలి ఎడిటింగ్‌కు పెద్దగా పని చెప్పాల్సిన అవసరం లేకుండా పోయింది. రత్నవేలు కెమెరా పనితనం అద్భుతంగా ఉంది. ఆ నాటి పరిస్థితుల్ని గోదావరి అందాలను కెమెరాలో చక్కగా బంధించారు. దర్శకుడి మదిలో మెదిలిన ప్రతి సన్నివేశాన్ని తన కెమెరాతో ప్రాణం పోశారు. రామ్-లక్ష్మణ్ పోరాట సన్నివేశాలు ఆకట్టుకుంటాయి.

ఇక 'రంగస్థలం' కెప్టెన్ సుకుమార్ 'లెక్క' అదిరిపోయింది. ప్రతీ సన్నివేశంలోనూ ఆయన మార్కు స్పష్టంగా కనిపిస్తుంది. పాత్రలను ఎంపిక చేసుకున్న విధానం, వాటిని తీర్చిదిద్దిన తీరులో సుక్కు 'మార్కు' కనపడుతుంది. తాను అనుకున్న కథను తెరపై తీసుకొచ్చి, మనల్ని కూడా 'రంగస్థలం'లోకి తీసుకెళ్లిపోయారు సుకుమార్.

## శ్రుతి హాసన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా?



కథానాయిక శ్రుతి హాసన్ ప్రస్తుతం 'శభాష్ నాయుడు' సినిమాలో నటిస్తున్నారు. గత ఏడాది ఆమె 'ఎస్ 3', 'కాటమరాయుడు', 'బెహెన్ హెూగీ తెరీ' సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. వీటి తర్వాత కొత్త సినిమాలకు సంతకం చేయలేదు. ఇప్పుడు నటిస్తున్న 'శభాష్ నాయుడు' సినిమా 2016 ప్రథమార్ధంలో ప్రారంభమైంది. భారీ బడ్జెట్‌తో నిర్మించనున్న 'సంఘమిత్ర' చిత్రం నుంచి ఆమె కొన్ని కారణాల వల్ల తప్పుకున్న సంగతి తెలిసిందే. శ్రుతి కొత్త ప్రాజెక్టులు ప్రకటించకపోవడంతో త్వరలో పెళ్లి చేసుకోనున్నారని వదంతులు వచ్చాయి. అయితే ఈ ప్రచారాన్ని ఆమె ఖండించారు. తనకు ముందు కెరీర్ ముఖ్యమని చెప్పారు. కాగా తాజాగా ఆమె కొత్త ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ నటుడు విద్యుత్ జమ్వాల్ హీరోగా హిందీలో ఓ చిత్రం తెరకెక్కనుంది. దీన్ని మహేశ్ మంజ్రేకర్ రూపొందిస్తున్నారు. సీనియర్ నటుడు నసీరుద్దీన్ షా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇందులో కథానాయిక పాత్ర కోసం దర్శక, నిర్మాతలు శ్రుతిని కలిశారట. ఆమెకు కథ బాగా నచ్చిందని, డేట్స్ కూడా లాక్ చేశారని అంటున్నారు. అయితే ఈ భామ ఇంకా ప్రాజెక్టు కోసం సంతకం చేయలేదని తెలుస్తోంది. భారత్‌కు తిరిగి వచ్చిన ఓ ఎన్నారై జీవితం చుట్టూ ఈ సినిమా కథ ఉంటుందట.

## సైరా'లో చిరు, నయన్‌ని చూశారా?




మెగాస్టార్ చిరంజీవి టైటిల్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ చిరుకు గురువుగా కీలక పాత్ర పోషిస్తున్నారు.



ఇటీవల సినిమాలోని బిగ్‌బి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. తాజాగా సినిమాలో చిరంజీవి, నయనతార లుక్‌ను అమితాబ్ ట్విటర్ ద్వారా పంచుకున్నారు. చిరు, నయన్ యాగంలో కూర్చోవడం..పక్కనే ఉన్న అమితాబ్ దంపతులపై అక్షింతలు చల్లుతున్నట్లుగా ఉన్న ఈ లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. చిరంజీవితో కలిసి పనిచేయడం గౌరవంగా ఉందని అమితాబ్ తెలుగులో ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు చిరు కోడలు ఉపాసన స్పందించారు. 'ఈ లుక్‌లో మామయ్య, బచ్చన్ జీ, నయనతార అద్భుతంగా ఉన్నారు' అని ట్వీట్ చేశారు. కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. జగపతిబాబు, విజయ్ సేతుపతి తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## బాఘి 2 రివ్యూ



బాలీవుడ్ కథానాయకుడు టైగర్ ష్రాఫ్ నటించిన చిత్రం 'బాఘి 2'. టైగర్ నటించిన 'బాఘి'కి సీక్వెల్‌గా తెరకెక్కిన చిత్రమిది. తెలుగులో విజయవంతమైన 'క్షణం' ఆధారంగా ఈ సినిమాను రూపొందించారని టాక్. టైగర్ నటించిన గత రెండు చిత్రాలు 'ఎ ఫ్లైయింగ్ జాట్', 'మున్నా మైఖేల్' ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విఫలమయ్యాయి. అందుకే ఇప్పుడు రాబోతున్న 'బాఘి 2' పై చాలా ఆశలే పెట్టుకున్నారు. ఈ చిత్రంతో తొలిసారి టైగర్, దిశా పటానీ కలిసి నటించారు. వారి జంట ప్రేక్షకులను అలరిస్తుందని చిత్రబ ృందం చెబుతోంది. మరి వారు చెప్పినట్లే సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుందా? కథేంటంటే: రోనీ(టైగర్) సైన్యంలో పనిచేస్తుంటాడు. కాలేజ్‌లో చదివేటప్పుడు నేహా(దిశా)తో ప్రేమలో పడతాడు. కానీ కొన్ని కారణాల వల్ల నేహాకు వేరే వ్యక్తితో వివాహమౌతుంది. తనకు ఓ పాప పుడుతుంది. ఓ రోజు ఆ పాప కిడ్నాప్ అవుతుంది. నేహా దిక్కు తోచని పరిస్థితుల్లో తన బిడ్డ ఆచూకీ కనిపెట్టమని రోనీని వేడుకుంటుంది. పాప కోసం రంగంలోకి దిగిన రోనీకి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? ఆ పాప దొరికిందా? ఇంతకీ ఆ పాపకు తనకు ఏమైనా సంబంధముందా అన్న విషయాలు తెరపై చూడాలి. ఎలా ఉందంటే: తెలుగులో వచ్చిన 'క్షణం' కథను టైగర్ శైలికి తగ్గట్లు యాక్షన్ మసాలా దట్టించి భారీ పోరాటాలతో 'బాఘి 2'ను తెరకెక్కించారు దర్శకుడు. ఈ చిత్రం కోసం టైగర్ కసరత్తులు చేసి దేహదారుఢ్యాన్ని పెంచుకోవడంతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. యాక్షన్ సన్నివేశాల కోసం టైగర్ పడిన శ్రమ సినిమాలో కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. దిశా పటానీ కూడా అక్రోబాటిక్స్‌లో శిక్షణ తీసుకున్నారు. చైనా, థాయ్‌లాండ్‌లో తెరకెక్కించిన పోరాట సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ఎవరెలా చేశారంటే: ఇందులో టైగర్ ష్రాఫ్ పాత్రే కీలకం. ప్రతి సన్నివేశంలో టైగర్ చక్కగా ఒదిగిపోయారు. టైగర్ యాక్షన్ సన్నివేశాలు చూస్తుంటే ఒక హాలీవుడ్ చిత్రం చూస్తున్నట్లు ఉంటుంది. అదీ కాకుండా సినిమాలో దాదాపుగా అన్ని యాక్షన్ ఘట్టాలు డూప్ లేకుండా చేసినట్లు గతంలో దర్శకుడు వెల్లడించారు. దిశా అందంగా కన్పించింది. తన పాత్రకు తగ్గట్టు నటించింది. మిగతా వారు కూడా తమ పాత్రల పరిధి మేరకు చక్కగా నటించారు.



# కష్టపడే వారి కోసం రచయిత రచనలు చేయాలి

## - ప్రముఖ కవి కాళీపట్నం రామారావు




విశాఖపట్నం : మాట్లాడేవారు రాయలేరని, రాసేవారు ఎక్కువగా మాట్లాడలేరని తానెన్నడూ ఎక్కువగా మాట్లాడలేదు కనుక రచయిత అయ్యానని ప్రముఖ కవి కాళీపట్నం రామారావు తెలిపారు. సాహిత్య అకాడమీ ఆద్వర్యంలో స్థానిక పౌరగ్రంధాలయంలో శుక్రవారం ఈశాన్య మరియు దక్షిణ భారతదేశ రచయితల సమాగమనం ఏర్పాటుచేశారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి దక్షిణ భారత దేశం నలమూలల నుంచి సాహితీప్రియులు, కవులు, రచయితలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాసిన రాతను బట్టే జీవితానుభవాలు కలుగుతాయన్నారు. సమాజానికి ఏదో ఒక మంచి చెయ్యాలి అనే తపన రచయితలో ఉంటుందన్నారు. కష్టపడే వారి కోసం రచయిత రచనలు చేయాలన్నారు. శ్రమజీవుల్ని ఉన్నత వర్గాలుగా తీర్చిదిద్దడానికి రచనలు ఉపయోగపడతాయన్నారు.

ఈ కార్యక్రమంలో సాహిత్యఅకాడమీ కన్వీనర్ శివారెడ్డి, కార్యదర్శి కె. శ్రీనివాసరావు, అస్సామీ రచయితలు లక్ష్మీనందన్ బోరా, బిపుల్ జ్యోతి సైకియా, తెలుగు రచయితలు పి. అదేశ్వ రావు, కె. సంజీవరావు, రామతీర్థ, బోడోకవి రీతూ రాజ్ బసుమతరి, కన్నడ బిఆర్ లక్ష్మణరావు, మళయాళం వి మధుసూదన్ నాయర్, మణిపురి తౌదం, నేత్రజిత్‌సింగ్, నేపాలీ అభిర్ కళింగ్, తమిళం అళగియ పెరియవన్, ఉర్దూ అస్లాం హుస్సేన్‌లతోపాటు అధికసంఖ్యలో రచయితలు పాల్గొన్నారు.

## బాల్‌బాడ్మింటన్ క్రీడాకారిణి ఘనత

యానాం : బిహార్ రాష్ట్రంలో జరిగిన ప్రప్రథమ బాల్‌బాడ్మింటన్ యూత్ నేషనల్‌లో ఇండియాన్ యూనివర్శిటీ మహిళా జట్టు తరుపున యానాం బాల్‌బాడ్మింటన్ క్లబ్ క్రీడాకారిణి యడ్ల శాంతి గోల్డ్ మెడల్ సాధించి ఘనత సాధించినట్లు క్లబ్ సెక్రటరీ కాపుగంటి అనురాగ ఆదర్శ శేషసుమన్ తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు బిహార్ రాష్ట్రంల జరిగిన ఈ పోటీలలో ప్రతిభ కనభరిచి ఈ ఘనత సాధించారన్నారు. చెన్నై ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటిలో చదువుతున్న యానాం బాల్‌బడ్మింటన్ క్లబ్ క్రీడాకారిణి అయిన శాంతి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటి బాల్‌బాడ్మింటన్ టోర్నమెంట్ 2016×17లో బ్రాంజ్ మెడల్ 2017 18లో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తు క్రీడాకారులను ముందుకు నడిపిస్తున్న శేషసుమన్‌ను కోచ్ బొట్టా శ్రీనివాసును సభ్యులను తోటి క్రీడాకారులను క్రీడాశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు అభినందించారు.

## ఘనంగా గుడ్‌ఫ్రైడే

యానాం : అతిపురాతన చరిత్ర కలిగిన కేథ్రలిక్ చర్చలో గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జామునుండి క్రైస్తువులు వేలాదిమందిగా తరలివచ్చి చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా కొవ్వుతులు వెలిగించి ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలనుండి వేలాదిగా తరలివచ్చి దైవ ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాదర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## ఈత పోటీలలో లక్ష్మికి పతకాలు

యానాం : పుదుచ్చేరిలో మంగళ, బుధవారాలలో జరిగిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో పాల్గొన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బిఎస్సీ అఖరి సంవత్సరం విద్యార్థిని పి. లక్ష్మి ఈత పోటీలలో ప్రథమ స్థానం సాధించినట్లు కోచ్ జేమ్స్ తెలిపారు. 50 మీటర్ల స్విమింగ్ ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్ విభాగాలలో విశ్వవిద్యాలయం స్థాయిలో నాల్గు రిజియన్ల విద్యార్థులు పోటీ పడగా లక్ష్మి ప్రథమ స్థానం సాధించారు. గత ఏడాది కర్నాటకలో ఉడిపిలో జరిగిన జాతీయస్థాయి స్విమింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచి వెండి పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఆమెను కళాశాల ప్రధాన ఆచార్యుడు జైరాజ్ డేనియల్ , ఇన్‌ఛార్జి ఆచార్యుడు పరుగు భాస్కరరెడ్డి, మేథమిటిక్స్ విభాగ ఆచార్యులు, కోచ్ ఉదయ్‌కుమార్‌లు అభినందనలు తెలిపారు.

## పనులు నిలిపివేయాలని వినతి

తాళ్లరేవు : నీలపల్లి పంచాయతీ పరిధిలోని పానేటి కాలువ వద్ద చేపట్టిన స్మశాన వాటిక అభివృద్ధి పనులను నిలిపివేయాలని కోరుతూ గ్రామానికి చెందిన తాలిపు సూరిబాబు, కొప్పుశెట్టి దేవి, కె. సుబ్రమణ్యం, పి. శుభద్ర, డి. రాజు, ఎ. సత్యవతిలు తహశీల్దారు లోధాజోసఫ్, ఎంపిడివో సిహెచ్ చినబాబులకు వినతిపత్రం అందచేశారు. వేసవిలో నీలపల్లిలో త్రాగునీటి ఎద్దడి నివారించేందుకు అభివృద్ధిచేసిన చెరువు చెంతనే స్మశానవాటికి ఏర్పాటుచేయడంపై వారు అభ్యంతరం వ్యక్తంచేశారు.

## క్రీస్తు శాంతి సందేశాన్ని అందించిన బోదకులు

# ఘనంగా గుడ్ ఫ్రైడే



రావులపాలెం : క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించే పండుగల్లో శుభ శుక్రవారం ఒకటి. క్రీస్తు శిలువపై మరణము నరులందరి పాప క్షమాపణకై మహొన్నతమైన త్యాగ ఫలితం. ఈ లోకంలో ఏవిధంగా పరిశుద్ధాత్మ మహిమచే జన్మించాడో అదేవిధంగా శిలువపై మరణం పునరుద్దానం పొందుట దేవుని పరిశుద్ధాత్మ మహిమని క్రైస్తవుల ప్రతీక. మండలంలో గుడ్ ఫ్రైడే సందర్భముగా అన్ని చర్చిల్లో అత్యంత భక్తి శ్రద్ధలతో పండుగను ఆచరించుకున్నారు. రావులపాలెం లిటిల్‌ఫ్లాక్ లూదరన్ చర్చ్ సిఆర్ కప్పల వర ప్రసాద్, పాస్టర్ రెవ. డామియన్ ఇశ్రాయేల్‌ల ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడేను జరుపుకున్నారు. పొడగట్లపల్లి బేతేలు ప్రార్ధనా మందిరం, సిమోను, షారోను మందిరం, రావులపాడు మరణాత మహిమ మందిరం, ఈతకోట బేతేలు మందిరం, గోపాలపుం ఎపిఫానియా లూదరన్ దేవాలయం, సిమోను మందిరం, ఊబలంక బేతేలు మందిరం, లక్ష్మీపోలవరం లూదరన్ చర్చ్, దేవరపల్లి బేతేలు మందిరం, కొమరాజులంక లూదరన్ చర్చ్, కేతరాజుపల్లి బేతేలు మందిరంలలో అత్యంత భక్తి శ్రద్ధలతో శుభ శుక్రవారాన్ని ఆచరించారు. ఈ సందర్భముగా భక్తులు గ్రామ పురవీధుల్లో ర్యాలీగా తిరుగుతూ క్రీస్తు శాంతి సందేశాన్ని అందించారు. అనంతరం చర్చిల్లో క్రీస్తు శిలువలో పలికిన 7 మాటలను గురించి భక్తులకు భోదించారు.

## ప్రవాసాంధ్రులకు భరోసా భీమా పథకం

రావులపాలెం : విదేశాలకు వలస వెళ్ళిన ప్రతి ఒక్కరి కుటుంబ ఆసరా కోసం నూతనంగా ప్రవాసాంధ్ర భరోసా భీమా పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఎపిఎమ్ జిలాని అన్నారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ కుటుంబ జీవనోపాధి కోసం విదేశాలకు వలస వెళ్ళిన వార్కి విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న వార్కి, అనుకోని విధంగా ఏదైనా ప్రమాదం సంభవించినపుడు శాశ్వత అంగవైకల్యం, మరణం వంటివి సంభవిస్తే ఈ పథకం కుటుంబానికి ఆసరాగా ఉంటుందని, ఈ పథకంలో చేరిన సభ్యులు ఎపి ఎన్‌ఆర్‌టి సొసైటీతో లబ్ధి పొందవచ్చున్నారు. ఈ పథకంలో 18 నుండి 60 సం॥లలోపు వయస్సు కలిగినవారందరూ అర్హులని తెలిపారు. ఇప్పటికే జీవనోపాదికోసం విదేశాలకు వెళ్ళిన సభ్యులు ఈ పథకంలో చేరేందుకు 8332987642 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

# ఎల్‌ఐసి ఆధ్వర్యంలో అధికారి నాగుకు సత్కారం



రావులపాలెం : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ వారు నూతనంగా ప్రవేశపెట్టిన భీమాశ్రీ పాలసీని మొట్టమొదటిగా గోపాలపురం ఉప సర్పంచ్ బాలాజీ ట్రాన్స్‌పోర్ట్ అధినేత అధికాని నాగేశ్వర రావు (నాగు) చేజిక్కించుకున్నారు. స్థానిక కొత్తపేట రోడ్‌లో గల ఎల్‌ఐసి కార్యాలయంలో శుక్రవారం బ్రాంచి మేనేజరు ఎ. రవీంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో భీమాశ్రీ మొదటి పాలసీదారుడైన అధికారి నాగేశ్వర రావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భముగా రవీంద్ర మాట్లాడుతూ ఈ పాలసీలో భీమా మొత్తం 10 లక్షలుగాను, లాభదాయకమైన మనీ బ్యాక్ పాలసీ అన్నారు. ఇటువంటి లాభదాయకమైన పాలసీలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరప్పాడు మాజీ సర్పంచ్, డి.ఓ. వై. ఫణికుమార్, ఏజంటు ఆగర్తి సతీష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో ఘనంగా చండీ హోమం నిర్వహించారు.ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా,పుణ్యవచనం అమ్మవారికి ముల మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు.11గం.లకు పూర్ణహుతి గావించారు.అనంతరం సుగంధ ధ్రవ్యాలను ఆలయ ఈవో మారెడ్డి.జితేంద్ర హోమ గుండంలో వేసారు.పూజా కార్యక్రమాలను చెళ్ళపిళ్ళ. ప్రసాద్ శర్మ తదితరులు పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎసి ఈరంకి.జగన్నాధరావు,దేవస్థానం ట్రస్టీ కొత్త.కొండబాబు,సీసీ గణపతి, ఆలయ అధికారులు,గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.అనంతరం భక్తులకు తీర్ధ,ప్రసాదాలు అందజేసారు.

## మంచి పుస్తకాలు ఉపయోగకరం

రోలుగుంట : నేటి ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులు లక్ష్యసాధన కొరకు మంచి పుస్తకాలు ఉపకరిస్తాయని ఇప్పటి నుంచే భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని తహశీల్దార్ అప్పలనాయుడు పేర్కొన్నారు. మండలంలోని రోలుగుంట కేజిబివి విద్యాలయంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవం ముఖ్య అతిధిగా పాల్గని మాట్లాడారు. చదువు అనే పునాదిపైనే వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎస్.త్రివేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంత్రి కృషితో నల్లంకి గ్రామానికి రోడ్డు మార్గం

గొలుగొండ : రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు కృషితో గొలుగొండ మండలం, పుత్తడి గైరంపేట పంచాయతీ శివారు గిరిజన గ్రామమైన నల్లం మారుమూల గ్రామానికి ఒక కోటి పదిహేను లక్షల రూపాయలతో తారురోడ్డు మంజూరు అయింది. దీంతో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో ఆయా గ్రామస్థులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## చోరికి గురైన సౌరదీపాలు

నాతవరం : నాతవరం మండలంలోని నాలుగు పంచాయతీల్లో గెయిల్ సంస్థ(గ్యాస్ అథారిటీ కంపెనీ లిమిటెడ్) ఏర్పాటు చేసిన సౌరదీపాలు చోరికి గురయ్యాయి. రెండేళ్ల క్రితం సుమారు రూ.12లక్షల ఖర్చుతో 60 సౌరదీపాలను అమర్చారు. దీంతో ఏపిపురం, మల్లుభూపాలపట్నం, మన్యపురట్ల, శరభవరంలో విద్యుత్ వెలుగులను అందించేవి. తాజాగా 30 చోట్ల వీటి బ్యాటరీలు చోరికిగురయ్యాయి.

## అత్యంత వైభవంగా శ్రీ సీతారాముల వారి వనవిహార మహోత్సవం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దివ్య సన్నిధిలో క్షేత్ర పాలకులుగా పూజలు అందుకొంటున్న శ్రీ సీతారాముల వారి దివ్య కళ్యాణ మహోత్సవంను పురష్కరించుకొని శుక్రవారం సాయంత్రం 4 గంటల నుండి దేవస్థానం జూనియర్ కళాశాల ప్రక్కన గల దేవస్థానం గార్డెన్ నందు శ్రీ సీతారాముల వారి వనవిహార మహోత్సవం కార్యక్రమం దేవస్థానం వేదపండితులు, అర్చకులు, ఋత్వికులచే అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఈవో ఎమ్.జితేంద్ర, ఎసి. ఈరంకి. జగన్నాధరావు, దేవస్థానం పాలకమండలి సభ్యులు కొత్త.కొండబాబు,పిఆర్వో తులా.రాముడు, దేవస్థానం అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ మానియా పుస్తకావిష్కరణ



రావులపాలెం : స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం నందు శుక్రవారం "పవన్ మానియా" పుస్తక ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఛాంబర్ అధ్యక్షులు కర్రి సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బండారు శ్రీనివాస్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భముగా బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ పవన్ రాకతో రాజకీయ ప్రక్షాళన జరుగుతుందని, ప్రజలు కొత్తగా వచ్చిన జనసేన పార్టీ వైపు చూస్తున్నారని, యువత మార్పు కోరుకుంటున్నారని, త్వరలో నియోజక వర్గం అంతా తిరిగి కమిటీలు వేస్తామన్నారు. రచయిత కొవ్వూరి సీతారామిరెడ్డి ముద్రించిన పవన్ మానియా పుస్తకాన్ని ఆవిష్కరించడం అదృష్టమన్నారు. ఛాంబర్ అధ్యక్షులు కర్రి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పేరు చెప్పగానే యూత్‌లో మంచి ఎమోషన్ ఉందని, సమస్యలపట్ల ఆయన స్పందించే తీరు ఆయన నాయకత్వానికి పరాకాష్ట అన్నారు.

ఈ కార్యక్రమంలో జనిపిరెడ్డి తాతారావు, మహేంద్రరెడ్డి, కె. పవన్ మణికంఠ, జి. కిషోర్, గుత్తుల అంజి, వీరబాబు, కె. గంగిరెడ్డి, ఎ. సత్తిబాబు గౌడ్, ఎస్. సత్య నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామి వారి తెప్పోత్సవం

రావులపాలెం : వాడపల్లి వెంకన్న కళ్యాణ మహొత్సవాల్లో భాగంగా ఐదవ రోజు స్వామి వారి " తెప్పోత్సవం " ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి దర్శనములనంతరం మహాశాంతి హెూమం, ప్రధాన హెూమములు, మహాపూర్ణాహుతి, అవభృథోత్సవం వంటి కార్యక్రమాలు వైష్ణవ సాంప్రదాయపద్ధతిలో నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సత్య నారాయణరాజులు తెలిపారు. భక్తజన సందోహం నడుమ బాణా సంచాతో, కోలాటాల నడుమ, బ్యాండు మేళాలతో పుణ్య గోదావరి తీరానికి భక్తి పారవశ్యంతో వేదమంత్రాలతో స్వామివార్ని ప్రత్యేకంగా విద్యుద్దీపకాంతులతో, పూల అలంకరణతో తీర్చిదిద్దిన హంస రూపంలో ప్రత్యేకంగా తయారుచేయించిన తెప్పలో వేంచేయించపజేసి ఘనంగా తెప్పోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భముగా గోదావరి తీరం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. కిక్కిరిసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు పాలు, ప్రసాదం, భోజన వసతి కల్పించారు. ఈ తెప్పోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు తూము వెంకటరావు, పడాల పద్మావతి, పోలిమాటి శ్రీను, కోమలి సత్యనారాయణ, పిపి రాజగోపాల్, ఏపుగంటి వెంకన్న, వేగేశ్న లక్ష్మీపతిరాజు, కొంతం వెంకట మహేష్ కృష్ణారావు, వాడపల్లి సుందర శేషావతారం, వేదపండితులు, సూపరింటెండెంట్ శ్రీదేవి, సిబ్బంది సాయిరామ్, నారాయణ, శివ, కోమలి తదితరులు పాల్గొన్నారు.

# వినాయక్ మంచి సందేశాత్మక సినిమాలు తీయాలి



రావులపాలెం : సినీ దర్శకుడు వివినాయక్ సినీ రంగ ప్రవేశం చేసి 16 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భముగా మండల పరిధి ఈతకోటలో వినాయక్ అభిమానులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈతకోట గ్రామంలో యూత్ అధ్యక్షుడు గంధ్రోతు వీర గోవిందరావు అధ్యక్షతన వివివినాయక్ 16 వసంతాల వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టిడిపి పార్టీ నాయకులు మాసాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. ఈ సందర్భముగా వివివి బంధువులు అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి శుభాభినందనలు తెలియజేసారు. వీర గోవిందరావు మాట్లాడుతూ నేటి సమాజానికి ఉపయోగపడే విధంగా, వినోదాత్మకంగా, ప్రజలకు సందేశాత్మకంగా ఎన్నో సినిమాలను నిర్మించడం, అత్యంత ప్రజాదరణ చూరగొన్న ఘనత వివి వినాయక్‌కే దక్కుతుందన్నారు. అనంతరం పాల్గొన్న అభిమానులు వివివినాయక్‌కు సంపూర్ణ ఆరోగ్యం కలుగజేసి మరిన్ని మంచి సినిమాలు తీయడానికి మంచి జ్ఞానాన్నికలుగజేయాలని భగవంతున్ని ప్రార్దించారు. అనంతరం స్వీట్లు, మిఠాయిలు, కేకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కె. సత్యనారాయణ, గంధ్రోతు దుర్గా సురేష్, పువ్వుల వీర్రాజు, ఎన్. మునేశ్వరావు, అధిక సంఖ్యలు అభిమానులు పాల్గొన్నారు.

# పాఠశాల నిర్మాణానికి సచిన్ విరాళం

**కృతజ్ఞతలు చెప్పిన జమ్ముకశ్మీర్ సీఎం ముఫ్తీ**

శ్రీనగర్: క్రికెట్ దిగ్గజం, రాజ్యసభ ఎంపీ సచిన్ తెందూల్కర్‌కు జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కృతజ్ఞతలు తెలిపారు. కుప్వారాలోని ఓ పాఠశాల నిర్మాణం కోసం రూ. 40 లక్షల నిధులు అందించినందుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

కశ్మీర్‌లోని ఓ పాఠశాల భవన నిర్మాణం కోసం ఎంపీల్యాడ్స్ నుంచి రూ. 40లక్షలు అందించిన సచిన్ తెందూల్కర్‌కు కృతజ్ఞతలు. క్రికెట్‌లోనే కాదు బయట కూడా ఆయన మనకు ఆదర్శనీయం అని మెహబూబా ముఫ్తీ ట్వీట్ చేశారు. కుప్వారా జిల్లాలోని ద్రగ్‌ముల్లా ప్రాంతంలో పాఠశాల నిర్మాణం కోసం సచిన్ ఈ నిధులు అందించారు.



2012 ఏప్రిల్‌లో సచిన్ రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఆ తర్వాత రెండు గ్రామాలను దత్తత తీసుకుని అక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. త్వరలోనే ఆయన ఎంపీ పదవి నుంచి రిటైర్ అవబోతున్నారు.

# పేదల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం



- రాష్ట్ర ప్రజల గుండెచప్పుడు టీడీపీ
- పేద గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు
- ప్రధాని మోదీ రాష్ట్రంపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారు
- వైకాపా, జనసేన దొంగనాటకాలుడుతున్నాయి
- పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

కొయ్యూరు : తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం, లక్ష్యం, ఆశయం పేదవాడిని అభివృద్ధిలోకి తీసుకురావడమేనని పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శుక్రవారం పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండల ఏంరదం అల్లూరి కళామందిరం వద్ద జరిగిన సమావేశానికి ఆమెతో పాటు అరకు పార్లమెంటరీ పార్టీ టిడిపి ఇన్‌చార్జ్ ఎర్రా వేణుగోపాల్ రాయుడుతో పాటు త్రీమెన్ కమిటి సభ్యులైన నాగరాజు, మణికుమారి, ఎంవివిఎస్. ప్రసాద్‌తో పార్టీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధికి 2014 తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత కోట్ల రూపాయలు ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఇస్తున్నారని, అందులో భాగంగా 2018లో ఎస్టీ సబ్‌ప్లాన్‌కి అత్యధికంగా 4176 కోట్ల కేటాయించి గిరిజనులపై చంద్రబాబుకి ఉన్న ప్రేమ తెలిసిందన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత అప్పట్లో ఉన్న సంక్షేమ పథకాలు ప్రతీ పేద గిరిజనుడికీ ఇస్తూ ప్రతీ గ్రామానికి సీసీ రోడ్లు, కనీస అవసరాలైన మంచినీరు, కరెంట్, పింఛన్లు, ఎన్టీఆర్ గృహాలు ఇస్తూ చంద్రన్న బీమా పేరుతో ప్రతీ కుటుంబానికి జీవిత భరోసా ఇవ్వడం మన ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రంపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని తిరుపతి వెంకన్న సాక్షిగా ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బిజెపిని నిలదీస్తామన్నారు. వైసిపి, జనసేన పార్టీలు కలిసి దొంగనాటకం అడుతున్నాయన్నారు. అందుకు నిదర్శనం రాష్ట్రంలో వైసిపి శాసనసభ్యులు అసెంబ్లీకి రాకుండా పార్లమెంట్‌లో ఎంపిలు దొంగనాటకం ఆడుతున్నారన్నారు. పాడేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని అత్యధికంగా గెలిపించేలా అందరూ కృషి చేయాలన్నారు.

అరకు పార్లమెంటరీ టిడిపి పార్టీ ఇన్‌చార్జ్ ఎర్రా వేణుగోపాల్ రాముడు మాట్లాడుతూ పాడేరు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరిచేలా దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తున్నామని, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేలా చూస్తామన్నారు. పెళ్లికానుక, 50 యూనిట్ల ఉచిత విద్యుత్ గిరిజనుల ఇళ్లకు కల్పించిందన్నారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొర్రు రామమూర్తి అధ్యక్షత వహించగా పాడేరు గోవిందు మాస్టారు, బర్రా జయరాణి, కొట్టుగిళ్ల సుబ్బారావు, వంజంగి కాంతమ్మ, కొయ్యూరు, జికెవీధి, జి.మాడుగుల, చింతపల్లి, పాడేరు మండలాల పార్టీ అధ్యక్షులు కొర్రు రామమూర్తి, కొర్రా బలరామ్, ఎస్.చిట్టిబాబు, సత్యనారాయణ, పి.రామారావు, కొయ్యూరు ఎంపిపి జి.సత్యనారాయణ, జెడ్పిటిసి గాడి శ్రీరామ్మూర్తి, దుచ్చరి చిట్టిబాబు, వై.వరహాలబాబులతో పాటు సర్పంచ్‌లు, ఎంపిటిసి పాల్గొన్నారు.

# శబరిమలలో అపశ్రుతి

**అదుపుతప్పి ఏనుగు పరుగు .. తొక్కిసలాటలో పలువురికి గాయాలు**



శబరిమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శబరిమలలో శుక్రవారం అపశృతి చోటుచేసుకుంది. అయ్యప్పస్వామి జన్మదినం కావడంతో శుక్రవారం శబరిమల ఆలయంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఊరేగింపు కొనసాగుతున్న సమయంలో ఓ ఏనుగు అదుపుతప్పి పరుగులు తీసింది. దీంతో అక్కడున్నవారంతా భయకంపితులయ్యారు. ఈ సందర్భంగా తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు భక్తులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

**బాబు తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే**

# కేంద్రంతో లాలూచీ



విశాఖపట్నం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను ఓటుకు నోటు కేసులో దొరికిపోయాననే భయంతో, తాను చేస్తున్న భూదందా కేసులపై భయపడి కేంద్రంతో లాలూచీ పడుతున్నారని, కేంద్రం ద్వారా రావలసిన ప్రత్యేక హెూదాకై పోరాడలేకపోతున్నారని వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి కొయ్య ప్రసాద్ రెడ్డి విమర్శించారు.

శుక్రవారం మద్దిలపాలెం వైకాపా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

టీడీపీ ఎంపీలతో ముందుగా రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల పేరుతో విదేశాలలో తిరుగుతూ తన డబ్బును దాచుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సత్తి రామకృష్ణా రెడ్డి, పసుపులేటి ఉషాకిరణ్, రొంగలి జగన్నాధం, తదితరులు పాల్గొన్నారు.

# భావోద్వేగానికి గురైన ధోనీ



చెన్నై: ఎప్పుడూ ఎంతో ప్రశాంతంగా కనిపించే భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ భావోద్వేగానికి గురయ్యాడు. రెండేళ్ల నిషేధాన్ని ముగించుకుని ఈ ఏడాది తిరిగి ఐపీఎల్‌లో ఆడుతున్న జట్లు చెన్నై సూపర్‌కింగ్స్, రాజస్థాన్ రాయల్స్. మరో వారం రోజుల్లో ఈ ఏడాది మెగా ఐపీఎల్ టోర్నీ ప్రారంభంకానుంది. చెన్నై సూపర్‌కింగ్స్ జట్టుకు మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వం వహిస్తున్నాడు.

ఈ నేపథ్యంలో తాజాగా చెన్నై ఫ్రాంఛైజీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ధోనీ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత భావోద్వేగానికి గురయ్యాడు. నిషేధం కారణంగా గత రెండేళ్లు సొంత జట్టుకు దూరమై రైజింగ్ పూణె సూపర్ జెయింట్స్ తరపున ఆడాను. ఇప్పుడు తిరిగి సొంత జట్టుకు ఆడుతున్నాను. ఈ క్షణం ఎంతో ఉద్వేగభరితమైనది. ఝార్ఖండ్, టీమిండియా, ఐపీఎల్‌లో ఆడాను. ఝార్ఖండ్ తరపున ఆడింది చాలా తక్కువ. భారత్ తరపున ఇప్పటి వరకు 89 మ్యాచ్‌లు ఆడిన నేను చెన్నై తరపున ఎనిమిదేళ్లలో 159 మ్యాచ్‌లు ఆడాను. తిరిగి ఈ ఏడాది పసుపు రంగు జెర్సీ ధరించడం ఎంతో ఆనందంగా ఉంది అని ధోనీ భావోద్వేగంతో మాట్లాడాడు. ఏప్రిల్ 7న ఈ ఏడాది మెగా ఐపీఎల్ టోర్నీ ప్రారంభంకానుంది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. ముంబయిలోని వాంఖడే మైదానంలో ఈ మ్యాచ్ జరగనుంది.



గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసు క్రీస్తు శిలువ మార్గంలో ప్రార్థనలు చేసుకుంటూ చర్చికి వెళ్తున్న క్రైస్తవ సోదర సోదరీమణులు. ఏసే జీవము.. ఏసే సత్యము అంటూ జరుపుతున్న ర్యాలీ




# ఆదివారం నుంచే దీర్ఘకాల మూలధన పన్ను

దిల్లీ: స్టాక్‌మార్కెట్ మదుపర్లకు రుచించని రోజు రానే వచ్చింది. కేంద్ర బడ్జెట్‌లో రూ.లక్షకు పైబడ్డ ఈక్విటీ లాభాలపై 10శాతం దీర్ఘకాల మూలధన లాభాల(ఎల్‌టీసీజీ) పన్నును ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇది ఏప్రిల్ 1 అంటే ఆదివారం నుంచి అమల్లోకి రానుంది.

పన్ను ఎగవేతను అరికట్టే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దేశీయ మదుపర్లతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మన స్టాక్‌మార్కెట్ల ద్వారా ఆర్జించే దీర్ఘకాల మూలధన లాభాలపై కూడా ఈ ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్‌ల నుంచి వచ్చే ఆదాయం (డిస్ట్రిబ్యూటెడ్)పైనా మదుపర్లు 10శాతం పన్ను కట్టాల్సి ఉంటుంది. ఈ మూలధన లాభాలపై పన్ను వల్ల తొలి ఏడాదిలో కేంద్రానికి వచ్చే ఆదాయం రూ. 20వేల కోట్లు అని బడ్జెట్ సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు.

ఇక ఈ ఎల్‌టీసీజీ పన్నుతో పాటు 25శాతానికి తగ్గించిన కార్పొరేట్ పన్ను, స్టాండర్డ్ డిడక్షన్ కూడా ఆదివారం నుంచే అమల్లోకి రానున్నాయి. రూ.250కోట్ల వరకు టర్నోవరు ఉన్న కంపెనీలకు కార్పొరేట్ పన్నును 25శాతానికి తగ్గించాలని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఇది కూడా ఆదివారం నుంచి వర్తించనుంది.

# అమెరికాకు వచ్చేవారు సోషల్‌మీడియా వివరాలు చెప్పాలి

వాషింగ్టన్: అమెరికాకు రావాలనుకుని వీసా దరఖాస్తు చేసుకున్నవారి నుంచి సోషల్ మీడియా వివరాలను కూడా తీసుకోవాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఫెడరల్ రిజిస్టర్‌లో ఓ డాక్యుమెంట్‌ను పోస్టు చేసింది. సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలతో పాటు పాత ఫోన్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలు కూడా తీసుకోవాలనుకుంటోంది. అమెరికాకు ముప్పు కలిగించే వ్యక్తులను దేశంలోకి రాకుండా నిషేధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

డాక్యుమెంట్‌లో పేర్కొన్న తాజా నిబంధనల ప్రకారం.. వలసేతర (నాన్ ఇమ్మిగ్రెంట్) వీసా కింద అమెరికాకు రావాలనుకునేవారు కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. గత ఐదేళ్లుగా దరఖాస్తుదారుడు ఉపయోగిస్తున్న సోషల్ మీడియా ఖాతాల వివరాలు, ఫోన్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలు అందించాలి. దీంతో పాటు ఇంతకుముందు ఏ దేశానికైనా వెళ్లారా? ఏ దేశం వారైనా మిమ్మల్ని బహిష్కరించారా? మీ కుటుంబంలో ఎవరికైనా ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలున్నాయా? తదితర ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి.

ఈ డాక్యుమెంట్‌ను అధికారికంగా శుక్రవారం పబ్లిష్ చేశారు. ఈ తాజా నిబంధనలపై తమ స్పందన తెలియజేయాలని అధికారులు ప్రజలను కోరారు. ఇందుకోసం 60 రోజుల గడువు కేటాయించారు. ప్రజల నుంచి సమ్మతి లభిస్తే ఈ నిబంధనలను వీసా దరఖాస్తు ప్రక్రియలో చేర్చనున్నట్లు తెలుస్తోంది.

# కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు భారీ షాక్!

**గాయంతో స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ దూరం**



కోల్‌కతా : ఐపీఎల్ ఆరంభానికి ముందే కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు భారీ షాక్ తగిలింది. ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరం కానున్నాడు. ఇప్పటికే భుజ గాయంతో మరో ఆసీస్ స్టార్ బ్యాట్స్‌మన్ క్రిస్‌లీన్ దూరమైన విషయం తెలిసిందే.

దక్షిణాఫ్రికాతో జరిగే నాలుగో టెస్టు ముందు మిచెల్ స్టార్క్ కుడికాలికి గాయమైందని అతని స్థానంలో 31 ఏళ్ల చాధ్ సేయర్స్ అరంగేట్రం చేయనున్నాడని క్రికెట్ ఆస్ట్రేలియా శుక్రవారం ప్రకటించింది.

దీంతో అతను ఆసీస్‌కు తిరుగు పయనమయ్యాడని, భవిష్యత్తు టెస్ట్ సిరీస్‌ల దృష్ట్యా స్టార్క్ మరి కొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే ఐపీఎల్‌కు సైతం దూరం కానున్నాడని ట్వీట్ చేసింది.

ఐపీఎల్ వేలంలో స్టార్క్‌ను కోల్‌కతా రూ. 9.4 కోట్లకు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే స్టార్ బ్యాట్స్‌మన్ క్రిస్‌లీన్ దూరం చేసుకున్న కోలకతా మరో స్టార్ బౌలర్‌ను కోల్పోవడం ఫ్రాంచైజీని కలవర పెడుతోంది.

ఇక స్టార్క్ గాయంతో గత సీజన్ ఐపీఎల్‌కు సైతం దూరమయ్యాడు.




VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com